ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 10 ఏప్రిల్ 2025



- ప్రమాదకరస్థాయిలో యూవీ కిరణాలు
- ఉమ్మడి గుంటూరుపై అతినీలలోహిత కిరణాల పడగ
- ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికంగా
- జాగ్రత్తలు తీసుకోకుంటే ముప్పేనంటున్న వైద్య నిపుణులు

10 యూవీ అంటే ప్రమాద కరమే

వాతావరణంలో అతినీలలోహిత కిరణాలు 2 యూనిట్ల లోపు ఉంటే సాధారణ స్థాయిగా గుర్తిస్తారు. 3 నుంచి 5 లోపు ఉంటే మధ్యస్థంగా, 6-7 మధ్య ఉంటే అధికంగా ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గుర్తిస్తుంది. ఇక 8 నుంచి 10 వరకు ఉంటే అత్యధిక స్థాయిలో ఉన్నట్లు గుర్తించడంతో పాటు ప్రమాదకరమని రెడ్అలర్ట్ ప్రకటిస్తారు.


వణికిస్తున్న యూవీ కిరణాలు

రేడియేషన్... రెడ్అలర్ట్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నుంచి పగలు ఎండలు మండుతున్నాయి. రాత్రిల్లు మంచుతో పాటు చలిగాలులు వీచాయి. ఈ విచిత్రమైన వాతావరణ పరిస్థితులతో పలువురు అనారోగ్యాలకు గురయ్యారు. ఉన్నట్టుండి వాతావరణంలో చోటు చేసుకుంటున్న విపరీత మార్పులపై ప్రజల్లోనూ భాయాందోళన నెలకొంది. ఈ వేసవిలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధికస్థాయిలో అతి నీల లోహిత కిరణాలు ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గుర్తించింది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య ఈ కిరణాల తీవ్రత అధికంగా ఉంటోందని హెచ్చరికలు జారీ చేసింది. అతినీలలోహిత కిరణాల్లో ఉండే రేడియేషన్ మనుషుల్లో పలు రకాల ఆరోగ్య సమస్యలకు కారణమౌతుంది. ముఖ్యంగా వడదెబ్బ, సన్‌బర్న్, కంటి శుక్లాలు, చర్మం ముడతలు పడటం వంటి సమస్యలతో పాటు కొన్నిసార్లు చర్మ కేన్సర్లకు అతి నీలలోహిత కిరణాలు కారణమౌతాయి. యూవీ కిరణాల తీవ్రత అధికంగా ఉన్నప్పుడు జనాలు ఎండలో ఎక్కువ సేపు తిరిగితే సొరియాసిస్, బొల్లి రోగుల్లో ఎండ పడిన శరీర భాగాల్లో వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుంది. కొద్ది రోజులుగా పగటి వాతావరణంలో యూవీ కిరణాల తీవ్రత పెరుగుతోంది. ముఖ్యంగా గత మూడు రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాతావరణంలో 10 యూవీ రేడియేషన్ యూవీ కిరణాలు వెలువడినట్లు వాతావరణ శాఖ గుర్తించింది.

వీరు జాగ్రత్తగా ఉండాల్సిందే...


తక్కువ తరంగ దైర్ఘ్యం కలిగి ఉండటం వల్ల అతి నీలలోహిత కిరణాలు దృశ్యకాంతి కంటే అధికంగా చర్మలోతుల్లోకి చొచ్చుకొని పోగలవు. శరీర కణాల్లో డీఎన్ఏను దెబ్బతీసే సామర్థ్యం వీటికి ఉంటుంది. ఈ కారణంగా ఈ కిరణాల నుంచి రక్షణ కోసం బహిరంగ ప్రదేశాల్లో తిరిగే వారు, బైకర్లు, ఎండలో పని చేసే వారు, మత్స్యకారులు, పర్యాటకులు, కంటి, చర్మవ్యాధులు ఉన్న వారు, పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లే సమయంలో పొడుగు చేతుల దుస్తులు, టోపీ ధరించడం, కళ్లద్దాలు ధరించడం శ్రేయస్కరమని వైద్యనిపుణులు చెబుతున్నారు. 'ఎండలో తిరిగే వారు సన్ స్క్రీన్ లోషన్ వాడనవసరం లేదు. శరీరంలో ఉండే మెలనిన్ రక్షణగా నిలుస్తుందని..' సీనియర్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ డీవీఎస్‌బీ రామ్మూర్తి తెలిపారు. సొరియాసిస్, బొల్లి వంటి చర్మవ్యాధుల ఉన్న వారు ఎండలో ఉండే యూవీ కిరణాల్లో ఎక్కువ సేపు తిరిగితే వారిలో వ్యాధి తీవ్రత మరింత పెరుగుతుందన్నారు.


సన్‌బర్న్ కేసులు వస్తున్నాయి...



వాతావరణంలోని అతి నీలలోహిత కిరణాల తీవ్రత కారణంగా గుంటూరు ప్రభుత్వ సమగ్రా స్పత్రి చర్మవ్యాధుల వైద్య విభాగానికి సన్ బర్న్ రోగులు చికిత్సల కోసం వస్తున్నారు. ఎండలో తిరిగే వారు సూర్యరశ్మి చర్మంపై పడకుండా తగిన దుస్తులు ధరించాలి. అధికంగా మంచినీరు, ఇతర ద్రవ పదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఎండలో తిరిగిన వారు అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే నీడ పట్టున కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి.

- డాక్టర్ లక్ష్మి, జీజీహెచ్ డెర్మటాలజిస్ట్





సిమెంట్ సిండికేట్

- బస్తాకు రూ.90 పెరుగుదల
- దూసుకుపోతున్న ఇనుము ధరలు
- టన్నుకు రూ.10 వేలు పెరిగిన ఐరన్
- నిర్మాణదారులు విలవిల.. రంగం కుదేలు
- ధరలపై కొరవడిన ప్రభుత్వ నియంత్రణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సిమెంటు, ఇనుము ధరలు దూసుకుపోతున్నాయి. ధరల పెరుగుదలతో నిర్మాణదారులు కళ్లు తేలేస్తున్నారు. ఇసుక ధర తగ్గిందన్న సంతోషం ఇనుము.. సిమెంట్ ధరల పెరుగుదలతో ఆవిరైపోయింది. వేసవిలో సహజంగా నిర్మాణాలు ఊపందుకుంటాయి. ఇదే అదనుగా కంపెనీలు ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నాయి. కంపెనీలు సిండికేట్‌తో సిమెంట్ ధరలను అమాంతం పెంచాయి. మూడు రోజుల వ్యవధిలోనే సిమెంట్ బస్తాకు రూ.80 నుంచి రూ.90 ధర పెరిగింది. ఇనుము నెల రోజుల వ్యవధిలో టన్నుకు రూ.10 వేలు పెరిగింది. ధరల పెరుగుదలపై ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా కొరవడింది. దీంతో కంపెనీలు ధరలపై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని నిర్మాణదారులు ఆరోపిస్తున్నారు. ధరల పెరుగుదల నిర్మాణదారులపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. సిమెంట్ ధరను పెంచడంతో పాటు సరఫరాను కంపెనీలు తగ్గించేశాయి. వ్యాపారులకు పూర్తిస్థాయిలో సిమెంట్ సరఫరా చేయడం లేదన్న విమర్శలున్నాయి. కృత్రిమ కొరతను సృష్టించేందుకు కంపెనీలు సిద్ధమయ్యాయన్న ఆరోపణలున్నాయి. సిమెంట్ కంపెనీలు సిండికేటై ఒక్కసారిగా బస్తాకు రూ.90 ధర పెంచాయని నిర్మాణదారులు వాపోతున్నారు. మార్కెట్‌లో విక్రయిస్తున్న అన్ని రకాల సిమెంట్ ధరలను కంపెనీలు పెంచేశాయి. రోజురోజుకు సిమెంట్ ధరలు పెరుగుతున్నా నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని నిర్మాణ రంగ వర్గాలు విమర్శిస్తున్నాయి. సిమెంట్ కంపెనీలకు పాలకులు ఒత్తాసు పలకడం వల్లే ధరలను ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత నెలలో ఇనుము టన్ను రూ.55,000 ఉంది. నెల రోజుల వ్యవధిలోనే మార్కెట్‌లో రూ.65 వేలకు చేరింది. రెండు రోజుల క్రితం ఒకేసారి టన్నుకు రూ.4 వేలు పెరిగిందని నిర్మాణదారులు చెప్పారు. ఇనుము, సిమెంట్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో 20 శాతం భారం పడిందని నిర్మాణ దారులు వాపో తున్నారు. ధరల పెరుగుదలతో నిర్మాణాలను పలువురు నిలిపివేస్తున్నారు. దీంతో కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు. ధరలను నియంత్రించి నిర్మాణ రంగాన్ని ప్రభుత్వం కాపాడాలని నిర్మాణదారులు కోరుతున్నారు.

ఇసుక టన్ను రూ.500

అక్రమార్కుల మధ్య పెరిగిన పోటీతో ఇసుక ధర తగ్గింది. టన్ను ఇసుక రూ.500కు ప్రస్తుతం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఇసుక సరఫరా నిలిచిపోయింది. దీంతో కృష్ణానదిలో ఇసుక అక్రమ మైనింగ్ పెద్దఎత్తున జరుగుతోంది. రోజు వేలాది టన్నుల ఇసుక మార్కెట్‌లోకి అక్రమార్కులు తరలిస్తున్నారు. నాణ్యమైన ఇసుక అందుబాటు ధరలోకి రావడంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో సిమెంట్, ఇనుము ధరలు పెరగడంతో ఈ ప్రభావం నిర్మాణాలపై పడుతోంది.

- గుంటూరు, పల్నాడు జిల్లాలు వెనకడుగు
- గుంటూరులో 2, పల్నాడులో 12 మాత్రమే నిర్మాణం
- బాపట్లలో ఇప్పటికే 74 పూర్తి.. మరో 51కి అనుమతి
- రెండు వారాల వ్యవధిలో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- ఉపాధి హామీ పథకాన్ని విరివిగా వినియోగించాలని సూచన

నీటి తొట్టెలపై.. నిర్లక్ష్యం

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవి వేడి, వడగాడ్పుల దృష్ట్యా పశువులపై తీవ్ర ప్రభావం పడకుండా నీటి తొట్టెలను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ నీటి తొట్టెల నిర్మాణాలపై అధికారుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది. మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించినా అధికారుల్లో పెద్దగా స్పందన లేదని నీటి తొట్టెల నిర్మాణాలను చూస్తే అర్థమవుతోంది. గుంటూరు జిల్లాలో మొత్తం 30 తాగునీటి తొట్టెలు పశువులకు అవసరం అవుతాయని అంచనా వేశారు. అయితే వీటిలో ఇప్పటి వరకు కేవలం రెండు మాత్రమే నిర్మించారు. పల్నాడు జిల్లాలో వాతావరణం ఎక్కువ వేడిగా ఉంటుంది. అంతేకాకుండా అక్కడ పశువుల సంఖ్య కూడా అధికం. ఈ దృష్ట్యా ఈ జిల్లాలో 248 నీటి తొట్టెలను వేర్వేరు గ్రామాల్లో నిర్మించాలని ఆదేశించగా వాటిల్లో కేవలం 12 మాత్రమే ఇప్పటివరకు ఆ జిల్లా అధికారులు నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో 236 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బాపట్ల జిల్లాలో అధికారులు కొంత శ్రద్ధ పెట్టడంతో అక్కడ ఇప్పటికే 74 తొట్టెల నిర్మాణం పూర్తి చేశారు. మరో 51 తొట్టెల నిర్మాణాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. వీటిని కూడా ఉపాధి హామీ పథకం ద్వారా తక్షణం పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి తొట్టెలను నింపే బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్‌కి కేటాయించారు. ఎండ వేడి నుంచి పశువులు, గొర్రెలు, మేకలను సంరక్షించుకోవడానికి శుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచేందుకు ఈ తొట్టెల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ప్రతీ పశువుకు రోజుకు సుమారు 30 నుంచి 40 లీటర్ల తాగునీరు అవసరం అవుతుంది. ఆవులకు 30 లీటర్లు, గేదెలకు 40 లీటర్లు, గొర్రెలు, మేకలకు 5 లీటర్లు నీరు అవసరం. ఇందుకోసం 5,200 లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి తొట్టెలను గ్రామాల్లో నిర్మించాలని ప్రభుత్వం సూచించింది.


పశువుల నీటి తొట్టె

ఆస్తులతో పాటు ఉపాధి..

రబీ సీజన్‌లో పంటల సాగు దాదాపుగా పూర్తి అయింది. వరి, ఇతర పంటల కోతలు ముగిశాయి. ఈ నేపథ్యంలో కూలీలు పనులు లేక ఇబ్బంది పడుతుంటారు. కొందరైతే ఇతర ప్రాంతాలకు వలస కూడా వెళుతుంటారు. ఈ నేపథ్యంలో నీటి తొట్టెల నిర్మాణ పనులను ఉపాధి హామీ కింద చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. దీనివల్ల అటు స్థిరాస్తులు ఏర్పడటమే కాకుండా ఇటు వ్యవసాయ కూలీలకు ఉపాధి పనిదినాలు అందుబాటులోకి వస్తాయి. ఇటీవలే రోజుకు ఉపాధి కూలిని రూ.300లకు పైగా ప్రభుత్వం పెంచింది. 100 రోజులకు పైగా పనిదినాలు కూడా కల్పించే అవకాశాన్ని కల్పించింది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణంపై అధికారులు దృష్టి పెడితే అటు మూగజీవాలకు ఇటు వ్యవసాయ కూలీలకు మేలు జరుగుతుంది.


మనవడు దేవాన్ష్‌తో కలిసి పూజ చేస్తున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు

శాస్త్రోక్తంగా సీఎం ఇంటి భూమిపూజ

హోమం చేసిన సీఎం దంపతులు

లోకేశ్, బ్రాహ్మణికి పట్టువస్త్రాలు పెట్టిన రైతులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల వెలగపూడిలో తీసుకున్న స్థలంలో ఇంటి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. అధికారిక హోదాలో ఎలాంటి హడావుడి లేకుండా పరిమిత సంఖ్యలోనే ఆహ్వానితులు, బంధుమిత్రుల సమక్షంలో శంకుస్థాపన జరిగింది. ఉదయం 7 గంటలకు ఉండవల్లిలోని ప్రస్తుత నివాసం నుంచి కుటుంబ సభ్యులంతా వెలగపూడిలోని తమ ఇంటి స్థలం వద్దకు చేరుకున్నారు. ఉదయం 8గంటల 51 నిమిషాలకు చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, తమ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్‌తో కలిసి, పునాదుల్లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, నిర్మాణాన్ని ప్రారంభించారు. మనవడు దేవాన్ష్‌ను ఒళ్లో కూర్చోబెట్టుకుని సీఎం చంద్రబాబు క్రతువులు నిర్వహించారు.

● అపూర్వ స్వాగతం పలికిన రైతులు

ఇంటి శంకుస్థాపనకు వస్తున్న సీఎం కుటుంబ సభ్యులకు అమరావతి రైతులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. తమను ఆహ్వానిస్తే అందరూ రావాలనుకున్నామని, పరిమిత సంఖ్యతో కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడంతో తాము పరిమితంగానే రావాల్సి వచ్చిందని చాలామంది రైతులు వాపోయారు. అయినప్పటికీ తమ సంతోషాన్ని తెలియజేయడం కోసం అమరావతి మహిళలు రంగవల్లులతో ఆహ్వానం పలికారు. స్వాగత ద్వారం నుంచి హోమగుండం వరకూ ముగ్గులు వేసి, అందంగా రంగులు అద్ది నారావారి కుటుంబానికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు రాజధాని రైతులు పట్టు వస్త్రాలు బహూకరించారు. చంద్రబాబు కొనుగోలు చేసిన స్థల యజమాని కంచర్ల సాంబశివరావు ఆయన భార్య, మాజీ సర్పంచ్ శాంతకుమారి, కుమార్తె గీత(చిన్న) ఇద్దరు యువ దంపతులకు పట్టు వస్త్రాలు పెట్టారు.


మంత్రి లోకేశ్, బ్రాహ్మణి దంపతులకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న స్థల యజమాని కుమార్తె గీత

నేటి నుంచి చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు

12న కల్యాణోత్సవం.. 17న రథోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పిలుపు

మాచర్లటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మాచర్లలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఆలయంలో బుధవారం సమీక్షించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. శనివారం కల్యాణోత్సవం, 17న జరిగే రథోత్సవం సందర్భంగా భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రథోత్సవం రోజున వైద్యశిబిరం, తాగునీరు, పోలీసు బందోబస్తు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయం నుంచి బురుజు వరకు రహదారి మరమ్మతులను వేగవంతం చేయాలన్నారు. విద్యుత్ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్రహ్మోత్సవాల అనంతరం దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని మాచర్లకు పిలిపించి నియోజకవర్గ పరిధిలోని పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, తహసీల్దారు బందెల కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, స్పెషలాఫీసర్ గబ్రూ నాయక్, సీఐ పచ్చిపాళ్ల ప్రభాకరరావు, టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి, కొమెర అనంతరాములు, కజ్జం సైదయ్య, కంభంపాటి అనిల్, సూరె యలమంద, మద్దిగపు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగాలి

కలెక్టర్ పీ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రానున్న విద్యాసంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు గతంలో కంటే ఎక్కువగా ఉండాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లపై కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో బుధవారం మండల విద్యాశాఖాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లతో పోలిస్తే ఈ ఏడు అడ్మిషన్లు పెరిగేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీకేంద్రాల్లో ఆరేళ్ల లోపు పిల్లలు సుమారు 8517 మంది ఉన్నారని, వారందరినీ పీపీ2 నుంచి ఒకటో తరగతిలో చేర్పించాలన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా పాఠశాలలు మూసేనాటికి సమావేశాలు నిర్వహించుకుని లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. అడ్మిషన్ల విషయంలో ఐసీడీఎస్ సిబ్బంది సహకారం అందించాలన్నారు. బాల ఆధార యాప్‌లో పెండింగ్‌లో ఉన్న పిల్ల ఆధార్ వివరాలు త్వరితగతిని అప్‌లోడ్ చేయాలన్నారు. మదర్ ఆధార్‌లో తప్పులను సరిచేయాలన్నారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు, స్పాట్‌వాల్యూయేషన్ ఎటువంటి అవాంతరాలు లేకుండా జరిగిందన్నారు. 8 నుంచి 22వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహించనున్న 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు గోడ ప్రతిని ఆవిష్కరించారు.

5.50 లక్షల ఎంటీ ఇసుక నిల్వ చేయాలి

నరసరావుపేట: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుక నిల్వ చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని మైనింగ్ శాఖను ఆదేశించారు. డీసిల్టింగ్ పాయింట్లు, మాన్యువల్ ఇసుక రీచ్‌లు, పట్టాల్యాండ్‌లలో డీకాస్టింగ్, ఓపెన్ ఇసుక రీచ్‌ల కార్యకలాపాల ద్వారా ఇసుక నిల్వలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా మైనింగ్ అధికారి నాగిని, జేసీ సూరజ్ తదతరులు పాల్గొన్నారు.



జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు

క్లీనర్‌ను కాపాడిన గోల్డెన్ అవర్ ఇంజెక్షన్



వినుకొండ ఏరియా వైద్యశాల్లో లారీ క్లీనర్‌కు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుండె పోటు వచ్చిన లారీ క్లీనర్‌ను సకాలంలో ఏఎన్ఎం, సీహెచ్‌వోలు స్పందించి ప్రాణాలు నిలిపిన ఉదంతం కంచర్ల ప్రాథమిక వైద్యశాలలో జరిగింది. కంచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎం నాగవాణి వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచర్ల గ్రామంలోని ఓ రైస్ మిల్లుకు విజయవాడ నుంచి ధాన్యం లోడుతో ఓ లారీ వచ్చింది. లారీలోని క్లీనర్‌కు ఒళ్లంతా చెమటలు పట్టి అస్వస్థతకు గురవటంతో కంచర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. క్లీనర్ పరిస్థితి గమనించి నాగవాణి, ప్రమీలలు గుండెపోటుగా గుర్తించి తమ కారులో క్లీనర్‌ను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేర్చారు. ప్రమాదాన్ని గుర్తించిన వినుకొండ వైద్యాధికారి డాక్టర్ రజాక్ సిబ్బంది సాయంతో క్లీనర్‌కు ఈసీజీ, బీపీ, రక్త పరీక్షలు చేసి గుండెపోటు వచ్చినట్లు నిర్ధారించారు. ఇటీవల ప్రభుత్వ వైద్యశాలల్లో రూ.40 వేలు విలువ చేసే గుండెపోటు నివారణ ఇంజెక్షను తక్షణమే ఇచ్చి ప్రాణాలను కాపాడారు. అనంతరం విజయవాడలోని క్లీనర్ బంధువులకు సమాచారం అందించారు. మెరుగైన వైద్యంకోసం 108 అంబులెన్స్‌లో గుంటూరుకు తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు, మిల్లు ఓనర్ శ్రీనివాసరావులు సత్వరమే స్పందించి క్లీనర్ ప్రాణాలను కాపాడిన ఏఎన్ఎం, సీహెచ్‌వో, వైద్య బృందానికి అభినందనలు తెలిపారు. వినుకొండ వైద్యశాల పరిధిలో ఇప్పటివరకు 15మందిని ఈ గోల్డెన్ అవర్ ఇంజెక్షన్ అందించి ప్రాణాలను కాపాడినట్లు వైద్యాధికారి డాక్టర్ రజాక్ తెలిపారు.

ఐఆర్ఆర్‌కు భూ సమీకరణ


2,196 ఎకరాల సమీకరణకు సీఆర్‌డీఏ సన్నాహాలు

వీలుపడని చోట భూసేకరణ ప్రయత్నాలు

సమీకరణ అయితేనే రైతులకు, సీఆర్‌డీకు ప్రయోజనం

భూములను సిద్ధం చేసుకున్నాకే రింగురోడ్డు నిర్మాణం

ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి భూ సమీకరణ విధానాన్ని అవలంబించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. దీనిపై త్వరలో కీలక నిర్ణయం తీసుకుని ముందుకెళ్లాలని యోచిస్తున్నారు. రాజధాని ప్రాంత పరిధిలోని అన్ని జిల్లాలకూ భూ సమీకరణ విధానాన్నే అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ విధానమైతే బహుళ ప్రయోజనకరంగా ఉంటుందన్న ఉద్దేశంతో సీఆర్‌డీఏ ఈ ఆలోచన చేసింది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో 2,196 ఎకరాలు కావాల్సి ఉంటుంది. ఈ భూములను భూ సమీకరణ విధానంలో తీసుకుంటేనే సీఆర్‌డీఏకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే 75 మీటర్ల వెడల్పున నిర్మించే ఇన్నర్ రింగ్‌రోడ్డుకు భూ సేకరణ విధానంలో అయితే సగటున రూ.3,000 కోట్ల మేర ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే భూ సమీకరణ విధానంలో అయితే అంత భారం ఉండదు. సమీకరణ విధానంలో అయితే రైతులకు ప్రతిగా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లను కల్పించాల్సి ఉంటుంది. ఇది రైతులకు ఎంతో ప్రయోజనకరం. ఎందుకంటే రూ.61 వేల కోట్లతో రాజధాని పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మూడేళ్లలో అమరావతి ఒక రూపును సంతరించుకోనుంది.

రాజధానిలో వచ్చే బూమ్ కారణంగా రైతులకు భూ సమీకరణ కింద ఇచ్చే ప్యాకేజీకి భారీగా విలువ పెరుగుతుంది. ప్రస్తుత మార్కెట్ ధరలను చూసినా కూడా రైతులు ఇచ్చే భూముల ధరలకు సమానంగా ప్యాకేజీ వచ్చే పరిస్థితి ఉంటుంది. ఈ దిశగా రైతులను చైతన్యపరచటానికి త్వరలో గ్రామసభలు నిర్వహించటానికి సన్నాహాలు చేస్తున్నారు.

భూములను సిద్ధం చేసుకున్నాకే ఐఆర్ఆర్

ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో ఇన్నర్ రింగ్‌రోడ్డు (ఐఆర్ఆర్)కు అవసరమైన 2,196 ఎకరాలను సిద్ధం చేసుకున్నాకే నిర్మాణ పనులు మొదలు పెట్టాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. భూములను సిద్ధం చేసుకోవటానికి ఏడాది సమయాన్ని నిర్దేశించుకుంది. ఆ తర్వాతే రోడ్డు నిర్మాణ పనుల దిశగా అడుగులు వేయాలని భావిస్తోంది. భూ సమీకరణకు ఎవరైనా అంగీకరించకపోతే భూ సేకరణ విధానంలో అయినా వెళ్లాల్సి ఉంటుంది.

పాత నోటిఫికేషన్ ప్రకారమే..

పాత నోటిఫికేషన్ ప్రకారమే ఐఆర్ఆర్‌ను కొనసాగించాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. అలైన్‌మెంట్‌లో ఎలాంటి మార్పులు చేపట్టకూడదని నిర్ణయించినట్టు తెలిసింది. పాత అలైన్‌మెంట్ ప్రకారం 96.16 కిలోమీటర్ల పొడవున, 75 మీటర్ల వెడల్పున ఐఆర్ఆర్ ఉంటుంది. ఐఆర్ఆర్‌కు క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న 27 రోడ్లు కూడా పాత అలైన్‌మెంట్ ప్రకారమే అనుసంధానమవుతాయి. సీఆర్‌డీఏ పరిధిలోని 11 జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ల పరిధిలో ఐఆర్ఆర్ వస్తుంది. మొత్తం 42 గ్రామాల మీదుగా సాగుతుంది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు సంబంధించి చోడవరం, దాములూరు, దోనె ఆత్కూరు, గంగూరు, ఇబ్రహీంపట్నం, జూపూడి, కవులూరు, కేతనకొండ, కొండపల్లి, కొండపల్లి రిజర్వు ఫారెస్ట్, కొటికలపూడి, కొత్తూరు, నవీపోతవరం, త్రిలోచనాపురం, జమీ మాచవరం, వెలగలేరు, రామచంద్రాపురం, వెదురుపావులూరు, సావారిగూడెం, నున్న, పాతపాడు, నిడమానూరు, పెనమలూరు, పోరంకి తదితర గ్రామాల మీదుగా అలైన్‌మెంట్ సాగుతుంది.

ఐఆర్ఆర్‌కు అనుసంధానమయ్యే అమరావతి రోడ్లు

ఇన్నర్ రింగ్‌రోడ్డుకు రాజధానిలోని మొత్తం 27 రోడ్లు అనుసంధానమవుతాయి. ఈ-1, 2, 3, 4, 5, 8, 9, 10, 11, 12, 13, 14, 15, 16, ఎస్-4, 7, 8, 9, 10, 11, 12, 13 రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వే వంటివి అనుసంధానమవుతాయి. ఇవన్నీ కూడా సింహభాగం 50 మీటర్లు, మిగిలినవి 60 మీటర్ల మేర ఉన్నాయి. మొత్తం 1,362.30 ఎకరాల మేర భూములు ఐఆర్ఆర్‌కు అనుసంధానమవుతాయి.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం సంపాదించాలన్న అత్యాశతో నిషేధిత గంజాయిని విక్రయాలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడిన ఉదంతం తెనాలిలో చోటుచేసుకుంది. బుధవారం స్థానిక త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ జనార్థనరావు, సీఐ రమేష్‌బాబు కేసు వివరాలను వివరించారు. డీఎస్పీ మాట్లాడుతూ గుంటూరుకు చెందిన నందిపాటి రాజశేఖరరెడ్డి, మేడికొండూరుకు చెందిన తమనంపల్లి అరుణ్‌కుమార్, తెనాలి చినరావూరుకు చెందిన దాసరి ప్రకాష్‌బాబులు ముగురు కలసి ముఠాగా ఏర్పడ్డారు. రాజశేఖరరెడ్డి హైదారాబాదు నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి దగ్గర 1.5 కేజీల గంజాయిని రూ.45 వేలుకు కొనుగోలు చేసి తెనాలి ప్రాంతానికి తెచ్చి చిన్నచిన్న ప్యాకెట్లుగా కళాశాలలు, ఇతర ప్రాంతాలలో యువకులకు విక్రయిస్తున్నారు. ఇదే క్రమంలో నిషేధిత గంజాయి అమ్ముతున్నట్లు త్రీటౌన్ పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా నిషేధిత గంజాయి ప్యాకెట్లతో పట్టుబడ్డారు. వారి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకొని నిందుతులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. నిషేధిత గంజాయి ఇతర మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లుగాని, అమ్మకాలు చేస్తున్నట్లుగాని ప్రజల వద్ద సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ వెల్లడించారు. గంజాయి విక్రేతలను చాకచక్యంగా పట్టుకున్న సీఐ ఎస్ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాషరావు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ జనార్ధనరావు అభినందించారు. కార్యక్రమంలో సీఐ ఎస్ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాషరావు, పీసీఎస్ పి మురళి, కె బాబురావు, ఎస్ జైకర్, ఎన్ శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలను తెలుపుతున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు, ఎస్సై ప్రకాష్‌రావు తదితరులు

సమయపాలన కోసం పదేపదే తప్పులు

గుంటూరు రైల్వే ఆపరేటింగ్ విభాగంపై విమర్శలు ● తరచూ సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు ● కొత్త డీఆర్ఎం అయినా పట్టించుకునేనా!

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైళ్ల సమయపాలన కోసం గుంటూరు రైల్వే డివిజన్ ఆపరేటింగ్ విభాగం అడ్డదారులు తొక్కుతున్నది. రైలు గుంటూరు రైల్వేస్టేషన్‌లో హోం సిగ్నల్ పాస్ అయిన తర్వాత సమయాన్ని ఆర్‌టీఎస్ ద్వారా ఆటోమేటిక్‌గా నమోదు చేయకుండా మాన్యువల్‌గా చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో రైళ్లు రెడ్డిగూడెం వద్ద ఉంటే బండారుపల్లి దాటి నల్లపాడు వచ్చేస్తున్నట్లు ఎంట్రీ కొడుతున్నారు. ఇక్కడ టెర్మినేట్ అయ్యే రైళ్లకు 15 నిమిషాల బఫర్ సమయం ఉండటంతో దాని ప్రకారం అంచనా వేస్తూ ఒకవేళ ఆలోపు రైలు వచ్చే పరిస్థితి లేకుంటే గూడ్స్ రైళ్లు ఆ సందర్భంలో పాస్ అయినా రైలు కింద నమోదు చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతున్నది.

ఏదైనా రైలు ఆలస్యమౌతుంటే ఆపరేటింగ్ విభాగంలో డిప్యూటీ అధికారి జోక్యం చేసుకొని ఆ ట్రైన్‌కు ప్రిసిడెన్స్ ఇచ్చి తీసుకొచ్చేలా చూడాలి. అలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కోసం 20 నిమిషాల నుంచి అరగంట పాటు నాన్‌స్టాపేజ్ రైల్వేస్టేషన్లలోని లూప్‌లైన్‌లో సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేసేస్తున్నారు.

ఎన్‌టీఈఎస్(నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టమ్)పై రైలు ప్రయాణీకులు నమ్మకం కోల్పోయేలా కొంతమంది ఆపరేటింగ్ విభాగం సిబ్బంది చేస్తున్నారు. బుధవారం ట్రైన్ నంబరు. 12748 వికారబాద్ - గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ని వందేభారత్ రైలు కోసం రెడ్డిగూడెం రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేశారు. దాదాపుగా ఈ రైలుని 25 నిమిషాల పాటు అక్కడ క్రాసింగ్ కోసం ఆపారు. అయితే ఆపరేటింగ్ విభాగం సిబ్బంది మాత్రం రైలు రాత్రి 8.09కి బండారుపల్లి దాటిందని, 8.19కి నల్లపాడు దాటిందని తప్పుడు సమాచారాన్ని ఎన్‌టీఈఎస్‌లో అప్‌డేట్ చేశారు. అది చూసి ప్రయాణీకులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. గతంలో నంబరు. 17254 ఔరంగబాద్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌ని నల్లపాడులో గంటకు పైగా ఆపి గూడ్స్ రైళ్లకు ప్రిసిడెన్స్ ఇచ్చినట్లు ఒక ప్రయాణీకుడు ఫిర్యాదు చేశారు.

ఈ తరహా సంఘటనలు గుంటూరు రైల్వే డివిజన్‌లో నిత్యకృత్యంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఆపరేటింగ్/స్టేషన్ సిబ్బంది మాన్యువల్‌గా రైళ్ల ఆగమన సమయాన్ని నమోదు చేయకుండా ఆర్‌టీఐఎస్ పంపే సమాచారాన్ని యథాతథంగా ఎన్‌టీఈఎస్‌లో అప్‌లోడింగ్ చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు. దీని వలన తమకు రైలు ప్రయాణిస్తున్న కచ్చితమైన సమయం తెలుసుకొనే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలానే రైలు ఏదైనా స్టేషన్‌కు వచ్చి ఆగి బయలుదేరినప్పుడు ఫస్టు సిగ్నల్ పాసింగ్ సమయం నమోదు అయ్యేలా చూడాలని సూచిస్తున్నారు. లేకుంటే ఇలాంటి సమాచారాలతో ఎన్‌టీఈఎస్ విశ్వసనీయత దెబ్బతింటుంది. నూతన డీఆర్ఎం సుధేష్ణ సేన్ ఆపరేటింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రయాణీకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపల్లె ఎక్స్‌ప్రెస్ చర్లపల్లి వరకే

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం రేపల్లె - సికింద్రాబాద్ - రేపల్లె మధ్యన రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌ని కొన్ని నెలల పాటు చర్లపల్లి వరకే నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి నంబరు. 17645 చర్లపల్లి - రేపల్లె ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి రాత్రి 9.05కి రేపల్లె చేరుకొంటుంది. నంబరు. 17646 రేపల్లె - చర్లపల్లి ఎక్స్‌ప్రెస్ ఉదయం 7.10కి బయలుదేరి మధ్యాహ్నం 3.35కి చర్లపల్లి చేరుతుంది. మార్గమధ్యలో ఉన్న రైల్వేస్టేషన్లలో ఎలాంటి సయమపట్టికలో ఎలాంటి మార్పులు చేయలేదని సీపీఆర్‌వో తెలిపారు.

హైదరాబాద్ డివిజన్‌లో ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ నెల 11, 12, 13 తేదీల్లో గుంటూరు - ఔరంగబాద్ ఎక్స్‌ప్రెస్‌ని 90 నిమిషాల పాటు రీషెడ్యూల్ చేస్తున్నట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

బొమ్మాయిపల్లి వరకు ఇన్‌స్పెక్షన్ నిర్వహించిన డీఆర్ఎం

గుంటూరు రైల్వే నూతన డీఆర్ఎం సుధేష్ణ సేన్ తన క్షేత్ర పర్యటనలను ప్రారంభించారు. బుధవారం ఉదయం ఆమె గుంటూరు నుంచి ప్రత్యేక రైలులో నడికుడి మార్గంలో ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. బొమ్మాయిపల్లి వరకు వెళ్లారు. మార్గమధ్యలోని స్టేషన్లలో దిగి అక్కడి పరిస్థితులను తెలుసుకొన్నారు. అలానే కృష్ణానదిపై వంతెన, గుంటూరు, నల్గొండ జిల్లాల్లో ఉన్న సరుకు రవాణ టెర్మినల్స్‌ని పరిశీలించారు.

కారుమూరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోండి

గుంటూరులో పోలీసులకు టీడీపీ నేతల ఫిర్యాదు



గుంటూరులో వెస్ట్ డీఎస్పీ అరవింద్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు కనపర్తి, మ్యానీ తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఇవతల వాళ్లను ఇంటిలో నుంచి లాగి కొడతామని.... గుంటూరు అవతల వాళ్లను నరికేస్తామని అత్యంత దారుణంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గుంటూరు వెస్ట్ డీఎస్పీ అరవింద్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రిస్టియన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, యల్లావుల అశోక్ యాదవ్, మైనార్టీ నాయకుడు పఠాన్ అస్మతుల్లా, అడకా శ్రీనివాసరావు, రఘు వెస్ట్ డీఎస్పీ అరవింద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కనపర్తి మాట్లాడుతూ మంగళవారం ఏలూరులో జరిగీన వెసీఈపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమాజంలో ప్రజల మధ్య, రాజకీయ పక్షాల మధ్య వైషమ్యాలు పెంచే విధంగా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలనే కుట్రతో నరికేస్తాం, ఇళ్లలో నుంచి లాగి కొడతాం అంటూ అత్యంత దారుణమైన వ్యాఖ్యలు చేశారన్నారు. ఆయన పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని పశ్చిమ డీఎస్పీ అరవింద్ కి ఫిర్యాదు చేశారు. కారుమూరి ఉడతూపులకు భయపడే ప్రసక్తే లేదని, జగన్ రెడ్డి లాంటి సైకోలానే ఎదిరించి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదని అన్నారు. బాధ్యత కలిగిన మాజీ ముఖ్యమంత్రి, మాజీ మంత్రులే ఇంత దారుణంగా విచక్షణ మరచి వ్యాఖ్యలు చేస్తుంటే ఆ పార్టీ నాయకులు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందన్నారు.

కన్నతల్లిని కడతేర్చిన కొడుకు

పోలీసుల అదుపులో నిందితుడు



బసవపూర్ణమ్మ (ఫైల్ ఫొటో)

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కన్న తల్లినే కొడుకు కడతేర్చిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. భట్టిప్రోలుకు చెందిన అంగలకుదురు బసవపూర్ణమ్మ (74)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు దుర్గారావు నిజాంప ట్నం మండలం అడవులదీవిలో తాపీ పని చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నాడు. ఆరు నెలల క్రితం భార్యతో గొడవపడి అక్కడి నుంచి భట్టిప్రోలు వచ్చి తల్లి వద్దే ఉంటున్నాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని తల్లితో తరచూ గొడవ పడుతుంటాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లిని కోరడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగి ఇంట్లో ఉన్న కత్తిపీటతో చెవి, తల వెనుక భాగంలో నరకడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెం దింది. తల్లి, కొడుకు గొడవ పడుతున్న విషయాన్ని చుట్టుపక్కల వారు గమనించినప్పటికీ రోజు పడే గొడవలే అను కొని పెద్దగా పట్టించుకోలేదు. కొద్దిసేపటి తరువాత అను మానం వచ్చి చూడగా వృద్ధురాలు మంచంపై విగతజీవిగా పడి ఉండటం గుర్తించిన వారు స్థానికంగా ఉంటున్న మరో కుమారుడు వెంకటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇంటికి వచ్చి తల్లిని చూడగా మృతి చెంది ఉండటం గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బుధవారం ఉదయం రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, వేమూరు సీఐ పీవీ అంజనేయులు ఘటనా స్థలాన్ని సందర్శించి హత్య జరిగిన తీరును పరిశీలించి క్లూస్ టీమ్‌తో వేలిముద్రలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం వైద్యశాలకు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అహంకార పూరితంగా వ్యవహరిస్తున్న జగన్ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం పాపిరెడ్డిపల్లెలో జగన్ చేసిన వీరంగం యాక్షన్ సినిమా క్లైమాక్స్ ను తలదన్నిందన్నినట్లుగా ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం పేర్కొన్నారు. పేరుకే పరామర్శ తప్ప జగన్ ప్రదర్శించినవన్నీ ఫ్యాక్షనిస్ట్ పోకడలేనని అన్నారు. పోలీస్ వ్యవస్థపై జగన్ చేసిన వ్యాఖ్యలు ఆయనలోని ఆధిపత్య ధోరణికి, అహంకారానికి నిదర్శనాలని అన్నారు. పోలీసుల బట్టలు ఊడదీయిస్తానన్న జగన్ వ్యాఖ్యలు ఏపీ పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చ అని,తన తప్పు తెలుసుకొని జగన్ బేషరతు క్షమాపణ చెప్పేవరకు పోలీస్ వ్యవస్థ పోరాడాలని సూచించారు. పోలీస్ అధికారుల సంఘం న్యాయస్థానాల్ని ఆశ్రయించి జగన్ కు శిక్షపడేలా చూడాలని పేర్కొన్నారు.

నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అర్బన్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం ఇటికంపాడు రోడ్డులో అక్రమంగా రేషన్ బియ్యం కలిగి ఉన్న మురళి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

12 ఎకరాల మొక్కజొన్న.. అగ్గిపాలు

ముప్పాళ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో, అది పక్కన ఉన్న పంటకు అంటుకోవడంతో ముప్పాళ్ళ మండలం కుందురువారిపాలెంలో 12 ఎకరాల్లోని మొక్కజొన్న దగ్ధమైంది. నష్టపోయిన వారిలో కౌలురైతులు కూడా ఉన్నారు. కాగా అగ్ని ప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా కావాలని పెట్టారా అనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. తగలబడిన పంట పొలాలను తహశీల్దార్ భవానిశంకర్ ఆదేశాల మేరకు వీఆర్వో బోరుపోతు మరియదాసు పరిశీలించారు.

మిర్చి రైతులకు వ్యాపారి టోకరా..

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు, అబ్బూరు, ఫిరంగిపురం మండలం 113 తాళ్ళూరు, యర్రగుంట్లపాడు గ్రామాలకు చెందిన రైతుల నుంచి లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన రావిపూడి తిరుమల రావు గతనెల 16న మిర్చి కొనుగోలు చేశాడు. గత కొన్ని సంవత్సరాలుగా తిరుమలరావు రైతుల వద్ద నుంచి కమ్మకంగా మిర్చిని కొనుగోలు చేస్తూ నగదు చెల్లిస్తున్నాడు. అదే నమ్మకంగా ఆయా గ్రామాలకు చెందిన సందు సురేష్, యస్‌కే సుభాని, మక్కెన సత్యన్నారాయణ, కొల్లికొండ కోటేశ్వరరావు, కొండవీటి ఏసుబాబు, కొండవీటి సీతారామయ్య, జొన్నలగడ్డ సుబ్బారావు, కొండవీటి నాగేశ్వరరావు, నర్రా కోటేశ్వరరావు, నర్రా మల్లేశ్వరరావు, నర్రా శ్రీను, కర్నాటి శేషగిరిరావు, సత్తెనపల్లి పోలిరాజు ల వద్దనుండి 41 లక్ష 3000 రూపాయల విలువైన 381.5 క్వింటాళ్ళ మిర్చిని కొనుగోలు చేశాడు. వీరిలో కొందరికి అడ్వాన్స్ కింద 6 లక్షల రూపాయలకు పైగా చెల్లించాడు. ఇంకా రైతులకు 34 లక్షల 85వేల 500రూపాయలను చెల్లించాల్సి ఉంది. ఈ నగదును యార్డులో మిర్చి అమ్మి చెల్లిస్తానని రైతులకు తిరుమలరావు చెప్పాడు. రోజులు గడుస్తున్నా తిరుమలరావు డబ్బును చెల్లించక పోవడం, అదేమని ప్రశ్నిస్తే ఊరు వదిలిపోతానా అని దురుసుగా సమాధానం చెప్పేవాడని రైతులు తెలిపారు. అనుమానం వచ్చి గట్టిగా నిలదీయడంతో తరవాత నుండి కనిపించడం లేదని ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందనీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని రైతులు రూరల్ పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేశారు. రైతు మక్కెన సురేష్‌బాబు ఇచ్చిన పిర్యాదు మురకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సత్తెనపల్లి రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు తెలిపారు.

ఎంఈవో వసూళ్ల దందాపై విచారణ

ఆంధ్రజ్యోతి వార్తకు డీఈవో రేణుక స్పందన

గుంటూరు(విద్య), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అప్పగించిన విధులు విస్మరించి ప్రైవేటు పాఠశాలల్లో , ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ విషయంలో వసూళ్ల దందాకు పాల్పడుతున్న ఇద్దరు ఎంఈఓ లపై డీఈవో రేణుక విచారణకు ఆదేశించారు. గుంటూరు డిప్యూటీ డీఈవో ఏసురత్నం ఆధ్వర్యంలో విచారణ చేపట నున్నారు .ప్రైవేటు పాఠశాలల యాజ మాన్యా లను, ఎయిడెడ్, ప్రభుత్వ ఉపాధ్యాయులను పూర్తిస్థాయిగా విచారించి ఎవరెవరు ఎంతెంత డబ్బులు ఇచ్చారనే దానిపై సమగ్ర నివేదిక తయారుచేసి డీఈవోకు సమర్పించనున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

1,35,382 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,31,198 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,35,382 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 62,733 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13200
273	10000	12800
341	10500	13800
4884	10000	11600
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10200	13400

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12400
బ్యాడిగి 355	10000	13200
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10000	12500
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6500

తెరుచుకున్న భవ్య డీఏవీ పాఠశాల

● ఆనందంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

దాచేపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గత 15 రోజులుగా మూతపడిన తంగెడ గ్రామంలోని భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆధీనంలో నిర్వహిస్తున్న డీఏవీ పాఠశాల తిరిగి తెచుకోవటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తంగెడ గ్రామంలో యాజమాన్యం ఆకస్మిక నిర్ణయాలతో పాఠశాలను మూసివేశారు. ఫలితంగా పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న 900మంది విద్యార్థులు, 35మంది బోధనా సిబ్బంది, మరో పదిమంది బోధనేతర సిబ్బంది ఆందోళన చెందారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి స్థానిక ప్రజలు తీసుకువెళ్లారు. ఎట్టకేలకు అధికారుల ఆదేశాలతో పాఠశాల పునఃప్రారంభమైంది. అలాగే దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామంలోని చెట్టినాడు సిమెంట్, తంగెడలోని భవ్య సిమెంట్ యాజమాన్యానికి, అధికారుల మధ్య చర్చలు సఫలం కావటంతో తిరిగి మంగళవారం నుంచి ఉత్పత్తులు ప్రారంభించాయి. దీంతో కార్మికుల్లో ఆనందం వ్యక్తమైంది.

మేలుజాతి లేగ దూడల ప్రదర్శన

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గోకుల మిషన్ పథకం కింద బుధవారం తుమ్మలచెరువు గ్రామంలో మేలుజాతి లేగదూడల ప్రదర్శనను బుధవారం డీసీ కమిటీ చైర్మన్ గండికోట వెంకటేశ్వర్లు ప్రారంభించారు. నరసరావుపేట పశువైద్య సహాయ సంచాలకుడు రామారావు మాట్లాడుతూ మేలుజాతి పశువుల పెంపకం వల్ల ముందుతరాలవారికి పశువులు, వాటివల్ల ఉపయోగాలు గుర్తుండేలా చేయాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయ సంచాలకుడు మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, రమేష్‌నాయక్, రామ్మోహన్, వీరారెడ్డి, సర్పంచ్ రాజారావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ఎన్నో ప్రయోజనాలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో పార్టీ కార్యకర్తలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ బద్రి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం దాచేపల్లి, గురజాల మండలాల పార్టీ సభ్యత్వం కార్డులను పార్టీనేతలు, గ్రామస్థాయి, బూత్‌లెవల్ ఇన్‌చార్జిలకు అందించారు. కార్యక్రమంలో నర్రా పుల్లయ్య, అక్కినపల్లి బాలయ్య, చికెన్ జానీబాషా, చింతపల్లి హసన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్ల ఖరారు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలోని గురజాల, పిడుగురాళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ మేరకు గురజాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఓసీ మహిళకు, పిడుగురాళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీ జనరల్‌గా ఖరారయ్యాయి.

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయండి

మాచవరం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీ లోపు మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి ఇంటి పన్నులను నూరుశాతం పూర్తిచేయాలని ఈవోపీఆర్‌డీ వెంకరావు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఇప్పటికే 70 శాతం వరకు వసూలైందని, మిగిలిన 30శాతం కూడా వసూలుచేసి చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని మాజీ సర్పంచ్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని ఫణిదం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధూళిపాళ్ళ వద్దగల ఎల్‌వీ ప్రసాదు కంటి ఆస్పత్రి, ఆయుష్ ఆస్పత్రులచే బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఎల్‌వీ ప్రసాదు వైద్య బృందం 283మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. పీఏసీఎస్ సహకారంతో 99మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. పీఏసీఎస్ సీఈవో ఆరాధ్యుల శ్రీనివాసరావు, పర్సన్ ఇన్‌చార్జ్ ఎంవీ నరసయ్య, టీడీపీ నాయకులు నిమ్మగడ్డ పూర్ణయ్య, యర్రగుంట్ల వెంకటేశ్వర్లు, ఎన్ సుబ్బారావు, ఎం శ్రీనివాసరావు, వైద్య బృందం పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

సత్తెనపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ ఆదేశాల మేరకు మే 10వ తేదీ సత్తెనపల్లిలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి విజయకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ తగాదాలు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, రెవెన్యూ కేసులు, బ్యాంక్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. సత్తెనపల్లి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు.

చిన్నారికి క్రికెటర్‌కు ప్రోత్సాహం

పట్టణానికి చెందిన నాల్గవ తరగతి విద్యార్థిని లావణ్య క్రికెట్‌పై మక్కువ చూపుతుండటంతో ఆమెకు నాగార్జున యూనివర్సిటీ కిక్రెట్ సెలెక్టర్ ప్రేమ్ బుధవారం 30 లెదర్ బాల్స్ అందించాడు. హైదరాబాద్‌కు చెందిన రాకేష్ రూ.14వేల విలువైన క్రికెట్ బ్యాట్ అందించాడు. నెల్లూరుకు చెందిన ఒక క్రికెట్ టీమ్ సభ్యులు రూ.5వేల నగదు, అమెరికాకు చెందిన నగేష్ రూ.200 డాలర్ల పోత్సాహక నగదును అందించారు.

రెండు లీటర్ల నాటు సారా స్వాధీనం

అచ్చంపేట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోగల జడపల్లిమోటు తండాలో బుధవారం ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో మూడావత్ మరోనీ బాయి నుంచి రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ తులసీ తెలిపారు. వీరితోపాటు మూడావత్ చిన్నకొండనాయక్‌ను కూడా అరెస్టుచేశామని, నిందితులను సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

స్థాయి గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదు

దాచేపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు పోలీసులను అడ్డుపెట్టుకొని తప్పుడు కేసులు పెట్టిస్తూ ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతూ వేల ఎకరాలు భూములను తమ పేర్లతో నమోదు చేయించుకుంటూ ప్రజలు బుద్ధిచెప్పినా తీరు మార్చుకోకుండా స్థాయిగురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని టీడీపీ నేతలు ఎద్దేవా చేశారు. బుధవారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు కన్వీనర్ బెల్లంకొండ బద్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో నర్ర పుల్లయ్య, మునగ నిమ్మయ్య, అక్కినపల్లి బాలయ్య, వేముల తిరుముల కుమార్, చికెన్ జానీబాషా మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యాల వద్ద కప్పాలు కట్టించుకొనే మాజీ ఎమ్మెల్యే కాసు, వైసీపీ నేతలకు కార్మికులు, రైతుల తరఫున పోరాటం చేసే ఎమ్మెల్యే యరపతినేని గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఎన్నికల హామీలను ఎలా అమలుచేయాలనేది మాకు తెలుసని, అవినీతితో కుళ్ళిపోయిన వైసీపీ నేతల వద్ద తెలుసుకోవాల్సిన అవసరం లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, తప్పుడు కేసులు, దాడులు, హత్యలు మినహా అభివృద్ధి జాడ లేదని విమర్శించారు. ఎమ్మెల్యే యరపతినేనిపై బురదజల్లే ప్రయత్నంలో భాగమే మాజీ ఎమ్మెల్యే, మాజీ వైసీపీ మండల నాయకుల ఆరోపణలు అన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు తమ తీరు మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐనాల శ్రీరాములు, మాదినపాడు జానీ, నాయబ్ అబ్దుల్లా, తిరుమల దుర్గారావు, ఆవుల శివకృష్ణ, తక్కెళ్ళపాడు సర్పంచ్ కిష్టంశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పల్నాడు వాటర్‌గ్రిడ్ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం

ఫేజ్-1లో 10 మండలాలకు సాగర్ జలాలు

● రూ.3200కోట్లతో తాగునీటికి పెద్దపీట

● మేకలగొంది వద్ద వాటర్ గ్రిడ్ నిర్మాణం

● ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే జూలకంటి భేటి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎన్డీఏ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.1200 కోట్లతో పల్నాడు వాటర్ గ్రిడ్ నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని విజయపురిసౌత్ వద్ద ఉన్న మేకలగొంది నుంచి సాగర్ బ్యాక్ వాటర్‌ను లిఫ్ట్ ద్వారా తీసుకొని ఫిల్టర్ చేసిన శుద్ధ జలాలను నియోజకవర్గంలోని శివారు గ్రామాలతో సహా శుద్ధజలాలను అందించేలా పల్నాడు వాటర్ గ్రిడ్ డీపీఆర్ సిద్ధమైంది. నియోజకవర్గం పరిధిలోని విజయపురిసౌత్ వద్ద ఉన్న మేకలగొంది నుంచి సాగర్ జలాలను ఓవర్‌హెడ్ ట్యాంకులకు ఎత్తిపోసి శుద్ధ జలాలను పైపులైను ద్వారా మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని 9 మండలాలకు, పెదకూరపాడులోని బెల్లకొండతో కలుపుకొని ఫేజ్ - 1 కింద 10 మండలాలకు పల్నాడు వాటర్ గ్రిడ్‌ను ఎన్డీఏ ప్రభుత్వం నిర్మించనుంది. టెండర్లను నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. దీనికి డీపీఆర్‌ను ఆ సంస్థ సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్ట్‌లో దాదాపు మాచర్ల నియోజకవర్గంలో పైపులైన్స్ అమర్చి శివారు గ్రామాలతో కలుపుకొని దాదాపు 165 గ్రామాలకు 150 ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను నిర్మించనున్నారు. పల్నాడు వాటర్ గ్రిడ్ ద్వారా శుద్ధ సాగర్ జలాలను నియోజకవర్గంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలకు శుద్ధ జలాలను కుళాయిల ద్వారా ఇంటింటికి అందిచాలనే ఉద్దేశంతో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా స్థాయి అధికారులతో ఎమ్మెల్యే జూలకంటి పట్టణంలోని కేసీపీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం భేటి అయ్యారు. నియోజకవర్గం పరిధిలో ఇప్పటికే 33 వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంకులు ద్వారా తాగునీరు అందుతోంది. ఈ క్రమంలో పైపులైను పనులు పూర్తిచేసి అదనంగా 150 ఓవర్‌హెడ్ ట్యాంకులను ఏడాదిలోపు పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో డీపీఆర్‌ను ఎమ్మెల్యే సమీక్షించారు. డీపీఆర్‌లో ఉన్న సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. మరో 45 రోజులు సర్వే అనంతరం పనులు ప్రారంభం అవుతాయని, అందుకు అనుగుణంగా పేపర్, ఫీల్డ్‌వర్క్ జరుగుతోందని ఎమ్మెల్యే జూలకంటికి అధికారులు వివరించారు. ఫేజ్-2 కింద దాదాపు రూ.2200కోట్ల ఖర్చుతో జిల్లా మొత్తం పల్నాడు వాటర్ గ్రిడ్ ద్వారా అందించనున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కళ్యాణ్‌చక్రవర్తి, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరు విజయకుమార్, మాచర్ల డీఈ కాశిరెడ్డి, పిడుగురాళ్ల డీఈ ఎస్ వెంకటేశ్వర్లు, మాచర్ల, రెంటచింతల, దర్గి, వెల్దుర్తి, మాచవరం ఏఈలు పాల్గొన్నారు.

అధికారులు స్పందించకుంటే చర్యలు

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై అధికారులు స్పందించకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. బుధవారం వెల్దుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు. అధికారులు స్పందించి ప్రాథమిక దశలోనే సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. కండ్లకుంట గ్రామంలో వైసీపీ నాయకుడు మంగదొడ్డి రామాంజి తన పొలాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.4.50లక్షలు తనకు తెలియకుండా రుణం తీసుకున్నాడని వీధుల శ్రీను ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. ప్రజాదర్బార్‌కు 80 అర్జీలు అందాయి. ఇందులో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన భూకబ్జాలు, దందాలు, దోపిడీలు, దౌర్జన్యాలు, అవినీతికి సంబంధించినవి ఉన్నాయి. వీటిపై నిర్దిష్ట సమయంలో విచారించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బాధితులకు భరోసానిచ్చారు.

హత్యా రాజకీయాలు ఇంకెంత కాలం పిన్నెల్లి..?

మాచర్లటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో ఇంకెంత కాలం హత్యా రాజకీయాలు చేస్తావు పిన్నెల్లి.. అంటూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఫైర్ అయ్యారు. బుధవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాచర్ల మండలంలోని పశువేముల గ్రామంలో పిల్లనిచ్చిన మామ, అల్లుడి మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో జరిగిన హత్యను మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. ఈవీఎం పగలకొట్టిన రౌడీకి వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చారని ఎద్దేవా చేశారు. పిన్నెల్లి శవ రాజకీయాలతో ఆత్మానందం పొందుతున్నారని విమర్శించారు. జగన్‌రెడ్డి విద్యార్థులకు రూ.4200కోట్ల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి ఫీజు పోరు చేయడం, రైతులను దగాచేసి రైతుపోరు చేయడం సిగ్గుచేటన్నారు. అందుకే ప్రజలు జగన్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్



వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్‌ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారినుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. సంబంధిత అధికారులు కూడా నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా..

ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కట్టమూరి వారి వీధికి చెందిన ఆర్యవైశ్యులు, ఆర్యవైశ్య మహిళలు బుధవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కట్టమూరి వారి వీధిలో మద్యం దుకాణం పెట్టవద్దని ఆర్యవైశ్య మహిళలు ఎమ్మెల్యే కి ఇటీవల వినతిపత్రం అందించారు. వెంటనే కన్నా స్పందించి ఆ ప్రాంతంలో ఎటువంటి మద్యం దుకాణం ఏర్పాటుచేయవద్దని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. దీంతో మద్యం దుకాణం ఏర్పాటును వ్యాపారులు విరమించుకున్నారు. దీనికి కృతజ్ఞతగా ఆర్యవైశ్యులు కన్నాను సన్మానించారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వం

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కొమెరపూడిలో పలు అభివృద్ధి పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును, రీమోడల్ చేసిన పశువైద్యశాల భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయభూన్‌బీ, టీడీపీ నాయకులు కోమటినేని శ్రీనివాసరావు, యర్ర వెంకటేశ్వరరావు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పామును తప్పించబోయి బావిలో పడిన భర్త, భార్య, కుమార్తె

● భార్య మృతి

నకరికల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పామును తప్పించే క్రమంలో అదుపు తప్పి బైక్‌తో సహా భార్య, భర్త, కుమార్తె బావిలో పడిన సంఘటన ఇది. పోలీసుల కథనం మేరకు.. షేక్ రమీజ, ఆమె భర్త షేక్ నాగుల్‌మీరా, ఏడు నెలల పాపతో కలసి గుండ్లపల్లి నుంచి గోళ్ళపాడు ముప్పాళ్ళకు బైక్‌పై బుధవారం బయలుదేరారు. చల్లగుండ్ల దాటిన తరువాత మలుపు వద్ద ఎదురుగా వచ్చిన పామును తప్పించేక్రమంలో బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న బావిలో పడి పోయింది. బైక్‌తో పాటు దానిపై ఉన్న భార్య రమీజా, ఆమె భర్త, పాప బావిలో పడి పోయారు. కేకలు వేయటంతో సమీపంలోని ప్రజలు వచ్చి వారిని బయటకు తీశారు. భర్త షేక్ నాగుల్‌మీరా, పాపను రక్షించగా భార్య రమీజా మాత్రం మృతిచెందింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పథకాన్ని ఉపయోగించుకోవాలి

ముప్పాళ్ళ ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న వారందరూ ఉపాధిహామీ పథకాన్ని ఉపయోగించుకోవాలని ఏపీఓ ఏడుకొండలు అన్నారు. మండలంలోని గోళ్ళపాడులో జరుగుతున్న ఉపాధిపనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలకు ఇబ్బంది కలుగకుండా ఉదయం 7 గంటలనుండి 11గంటల లోపు పనిచేయించాలన్నారు. ఎక్కువమంది కూలీలు పనులు చేసేలా గ్రామాలలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

కిచన్ గార్డెన్‌తో ప్రయోజనం

నకరికల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కిచన్‌గార్డెన్‌ను ఏర్పాటుద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ నాస్రీజాస్మిన్ తెలిపారు. బుధవారం మండలంలోని కండ్లకుంట గ్రామంలో మహిళా రైతులకు, ప్రజలకు కిచన్‌గార్డెన్ ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించారు. విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి దాసరి నవీన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ డీ విజయకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వుతున్నారని ఫిర్యాదు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అక్రమంగా క్వారీ ఏర్పాటుచేసి మట్టిని తరలిస్తున్నారని మండలంలోని లక్కరాజుగార్లపాడుకు చెందిన పాలేటి జయమ్మ బుధవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనకు గ్రామంలోని రెండుఎకరాల భూమి ఉందని, తన భూమికి ఆనుకొని బేతపూడి మస్తాన్‌వలికి చెందిన అర ఎకరం భూమి ఉందని ఆయన తెలిపారు. అర ఎకరం భూమిలో అక్రమ క్వారీ ఏర్పాటుచేసి మట్టిని తరలిస్తున్నారని, సుమారు నాలుగు అడుగుల లోతులో ఇప్పటికే మట్టిని తరలించారన్నారు. దీనివల్ల తమ పొలంలోకి వెళ్ళాలంటే ఇబ్బందిగా ఉందని ఫిర్యాదులో పేర్కొంది. క్వారీని పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరింది.

ఆలయ భూములకు వేలం

రెంటచింతల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రెంటచింతల పరిధిలోని శ్రీఆంజనేయస్వామి ఆలయభూములకు బుధవారం వేలం నిర్వహించినట్లు ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి చెప్పారు. 6ఎకరాల 90సెంట్లకు గతంలో రూ.36వేలు చెల్లించగా ఈ సారి రూ.70వేలకు శివగోపి పాడుకున్నారన్నారు. మరో 8ఎకరాల 40సెంట్లకు పాట నిర్వహించాల్సి ఉందన్నారు. వేలంలో పి.లక్ష్మారెడ్డి, సూపర్‌వైజర్ పూర్ణచంద్రరావు, గోపయ్య పాల్గొన్నారు.

ఆక్రమిత భూమి నీటిపారుదల శాఖ పరిధిలోది

ఎఫెక్ట్

కారంపూడి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినుకొండ రోడ్డులో వైసీపీకి చెందిన కొందరు ఆక్రమించుకొని పక్కా కట్టుబడులు నిర్మిస్తున్న భూమి నీటిపారుదల శాఖ పరిధిలోదని తహసీల్దార్ వెంకటేశ్వర నాయక్ తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన దర్జాగా కబ్జా అనే కథనానికి ఆయన స్పందించి విలేకరులతో మాట్లాడారు. వినుకొండ రహదారిలో సాగర్ కెనాల్ పక్కనే ఉన్న 551/1, 551/2 సర్వే నంబర్లలో మూడు ఎకరాల నీటి పారుదల శాఖకు చెందిన భూమి ఉందన్నారు. ఈ భూమి మొత్తం కొలతలు వేయించామన్నారు. ఈ భూముల్లో ఆక్రమకట్టడాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. మూడు ఎకరాల భూమి హద్దులు ఇరిగేషన్ అధికారులకు అప్పగించామన్నారు. దాని పక్కనే ఉన్న భూములు దేవదాయశాఖకు చెందినవన్నారు. వినుకొండ రహదారిలోని రెవెన్యూ భూముల్లో కొందరు పక్కా కట్టాడాలు కట్టుకొని విక్రయించుకున్నారని, ఆ భూములన్నీ సర్వే జరిపించి సంరక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శెట్టి హనుమంతురావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పూవాడ శ్రీనివాస్, టీడీపీ నేతలు కర్నా సైదారావు, దోర్నాల నాగిరెడ్డి, లింగాల శ్రీనివాసరావు, తోట రంగారావ, జనసేన నేతలు తహసీల్దార్‌ను కోరారు.

దొంగతనం చేసిన వ్యక్తి గుర్తింపు

రెంటచింతల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల పరిధిలో విత్తన వ్యాపారి ఆదూరి ఇన్నారెడ్డి గృహంలో దొంగతనం చేసి భారీగా సొమ్మును దోచుకున్న వ్యక్తిని గుర్తించారు. గురజాల మండలంలోని చర్లగుడిపాడుకు చెందిన సదరు వ్యక్తిపై 51 దొంగతనాల కేసులు వివిధ స్టేషన్లల్లో నమోదయ్యాయి. సీసీఎస్ పోలీసులు నిందితుడిని ఓ స్టేషన్ విచారిస్తున్నట్లు సమాచారం. ఈ దొంగతనం ఫిబ్రవరి 18న ఇన్నారెడ్డి, తాళ్లూరి సాంబశివరావు గృహాల్లో జరిగింది. రెండు రోజుల్లో కేసు కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయి. రెండు రోజులు క్రితం రెంటచింతల స్టేషన్‌లో సదరు దొంగపై కేసు నమోదైంది.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

గురజాలటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చర్లగుడిపాడులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చర్లగుడిపాడు గ్రామానికి చెందిన అక్కినపల్లి దుర్గ భవాని (28) మంగళవారం తన చిన్న కుమార్తె అల్లరి చేస్తుండగా మందలించి కొట్టడంతో ఆ చిన్నారి బంధువుల వద్దకు వెళ్లి ఏడ్చింది. బంధువులు చిన్నారిని ఎందుకు కొడుతున్నావని దుర్గభవానిని మందలించారు. దీంతో మనస్తాపం చెందిన దుర్గభాని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలికి భర్త, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రజాదర్బార్

బెల్లంకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ప్రజాదర్బార్ ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి మస్తాన్‌షరీఫ్ పేర్కొన్నారు. బెల్లంకొండ మండలంలోని న్యూ చిట్యాల ఆర్ అండ్‌ఆర్ సెంటర్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రవీణ్ గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు అందుబాటులో ఉంటారన్నారు.

అటల్ ల్యాబ్‌ను పరిశీలించిన స్టేట్ టీమ్

పెదకూరపాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 తాళ్ళూరు జడ్పీ హైస్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను అటల్ స్టేట్ అధికారి సుదర్శన్ పరిశీలించారు. బుధవారం హైస్కూల్‌కు వెళ్ళిన స్టేట్ టీమ్ ప్రతినిధులు రికార్డులను పరిశీలించి విద్యార్థులు చేస్తున్న ప్రాజెక్టులను పరిశీలించారు. కార్యక్రమంలో అటల్ స్టేట్ అధికారి, యునిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జ్ సుబ్బారావు, ఈఆర్‌డీసీ అధికారి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళులు

అమరావతి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా, సీబీఎన్ ఆర్మీ వలంటీర్‌గా టీడీపీ సోషల్ మీడియా సభ్యుడిగా సేవలందించిన ఎండ్రాయికి చెందిన ఎన్‌వీఎస్ రాజు అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మృతదేహానికి నివాళులర్పించారు. సంగం డెయిరీ డైరక్టర్ ధర్మారావు, అనిల్, విష్ణు, వసంతరావు నివాళులర్పించారు.

12న తెలుగు రాష్ట్రాలస్థాయి సినీపాటల పోటీలు

మాచర్లటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 12వ తేదీన లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల పల్నాడు ఆధ్వర్యాన తెలుగు రాష్ట్రాల స్థాయిలో సినీపాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ క్యాబినెట్ గెస్ట్ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలకు 94408 35472, 98490 65882లో సంప్రదించాలన్నారు.

ఎమ్మార్పీకే మద్యం అమ్మాలి: ఎక్సైజ్ సీఐ విజయకుమార్

ముప్పాళ్ళ ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలలో ఎమ్మార్పీ ధరలకే మద్యాన్ని అమ్మాలని ఎక్సైజ్ సీఐ పి.విజయకుమార్ అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాలలోని మద్యం దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో బెల్టుషాపులను నిర్వహించే వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. ఎస్ఐ కె.నాగలక్ష్మీ పాల్గొన్నారు.



దుకాలణాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ విజయకుమార్

ప్రజల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

క్రోసూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అందరినీ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతోనే నియోజకవర్గంలోని అన్ని మండలకేంద్రాల్లో వైద్యసేవలు అందిస్తున్నట్టు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం క్రోసూరు జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ప్రవీణ్ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కళాశాల సౌజన్యంతో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 500మంది రోగులు వైద్య శిబిరానికి హాజరయ్యారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు కోసం వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు వైద్యసేవలు అందించారు. శిబిరంలో టీడీపీ నాయకులు వేగుంట రాణి, తోక వెంకటరావు, గుడిపాడు బాషా, మన్నెం శ్రీనివాసరావు, ఏపూరి నాగేశ్వరరావు, షేక్ సలాం, నలజాల కోటేశ్వరరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు నలజాల సదాశివరావు, దుద్దుల యోహాన్, అనుమాల పూర్ణ, కాంద్రు కాశయ్య, ఏ వెంకటరామిరెడ్డి పర్యవేక్షించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి



ఎమ్మెల్యే కన్నాకు విన్నతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు, రైతులు

రాజుపాలెం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని మండల టీడీపీ నాయకులు, రైతులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కోరారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, అంచుల నరసింహరావు, తెలుగు రైతు జిల్లాకార్యదర్శి నల్లమోతుల శ్రీనివాసరావు, రైతులు బుధవారం ఎమ్మెల్యే కన్నాను కలిసి విన్నతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం లేకపోవటంతో రైతులు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నారని ఎమ్మెల్యేకి వివరించారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ



మాట్లాడుతున్న ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ

బెల్లంకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం బెల్లంకొండ ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. మురుగునీరు బయటకుపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ కలసికట్టుగా మండలాన్ని అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుందామని ఎంపీపీ పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో హనిమిరెడ్డి, తహసీల్దార్ మున్నీసా బేగం, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా జరగాలి

● డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బీ రవి



అచ్చంపేట పీహెచ్‌సీలో వ్యాక్సిన్‌లను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ రవి

అచ్చంపేట, ఏప్రిల్ 9(ఆంధ్ర జ్యోతి): ఆరోగ్య కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా జరగాలని డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ బీ రవి అన్నారు. బుధవారం మండలంలోని మాదిపాడు, చింతపల్లి సబ్‌సెంటర్లలో జరిగే కార్యక్రమాలను తనిఖీ చేశారు. వేసవి దృష్ట్యా చిన్నపిల్లలకు వేసే వ్యాక్సినేషన్‌ను ఉదయం 10గంటల లోపు పూర్తిచేయాలన్నారు. అనంతరం అచ్చంపేట పీహెచ్‌సీలో జరిగే కార్యక్రమాలను వైద్యాధికారి ఎం ఇన్నారావును అడిగి తెలుసుకున్నారు. రోజువారి రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలను వివరించాలన్నారు. ఈయనతో పాటు జిల్లా ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ డీ హనుమకుమార్, సీహెచ్‌వో హర్షవర్ధన్, శివనాగేశ్వరి, ఆరోగ్యవిస్తరణ అధికారి పీ వెంకటరావు, హెల్త్ ఎడ్యుకేటర్ పార్వతి, సూపర్‌వైజర్ పీ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ గ్రామ అధ్యక్షుడు దాడి



చికిత్స పొందుతున్న ప్రసన్న

మాచర్ల రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో టీడీపీ కార్యకర్తపై వైసీపీ గ్రామ అధ్యక్షుడు దాడిచేసి గాయపరిచిన సంఘటన బుధవారం జరిగింది. విజయపురిసౌత్ గ్రామ వైసీపీ అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి, టీడీపీ కార్యకర్త బట్లకుంట ప్రసన్నలు పక్కపక్కనే నివాసం ఉంటున్నారు. ప్రసన్న తన ఇంటి బయట ఊడుస్తుండగా రామిరెడ్డి తన ఇంటిలోకి చెత్తవస్తుందంటూ ప్రసన్నపై దాడిచేసి గాయపరిచాడు. ప్రసన్న తలకు బలమైన గాయంకావడంతో విజయపురిసౌత్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రామిరెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ షఫి తెలిపారు.


ఎయిడెడ్ పాఠశాలల వివరాలు కోరిన ప్రభుత్వం

రెంటచింతల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో వున్న ఎయిడెడ్ పాఠశాలల వివరాలను ప్రభుత్వం కోరింది. వారంరోజుల్లో పూర్తి వివరాలు సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరాజు ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంఈవో 2 శివనాగేశ్వరరావు బుధవారం చెప్పారు.

జిల్లాలో కొత్త తరహా మోసాలు జరుగుతోన్నాయి. ప్రజల అమాయకత్వాన్ని ఉపయోగించుకుంటూ చీటింగ్‌లకు పాల్పడే గ్యాంగ్‌లు పుట్టుకొస్తున్నాయి. ఇప్పటివరకు బ్యాంకులు/ఏటీఎంల వద్ద దొంగలు మాటు వేయడం, ద్విచక్ర వాహనాల డిక్కీల్లో దాచిన నగదుని దొంగిలించడం, టూవీలర్ పైనుంచి పడిపోతున్నట్లు నటిస్తూ పైకి లేపమని సహాయం కోరి పైజేబులో ఉన్న సెల్‌ఫోన్లు తస్కరించడం, నగలకు మెరుగు పెడతామంటూ ఇళ్ల వెంట వచ్చి మహిళలను మోస గిస్తున్న గ్యాంగులను చూశాం. తాజాగా అమాయక రైతుల ముసు గు ధరించి తక్కువ ధరకే నాణ్యమైన బీపీటీ బియ్యం ఇస్తామని చెప్పి మెల్లగా వారి మాయమాటలు నమ్మేలా చేసి తూకంలో కనికట్టు చేసి నిలువునా మోసగిస్తున్నారు.

రైతు వేషం.. కొలతల్లో మోసం

● ఇంటింటికి బియ్యం బస్తాలతో వస్తున్న గ్యాంగ్





సీసీ టీవీలో రికార్డు అయిన రైతుల ముసుగు ధరించిన చీటింగ్ గ్యాంగ్

- వరి పంట వేసి నష్టపోయామని కాళ్లు పట్టుకుంటూ నటన
- కేజీ రూ. 48కే బీపీటీ బియ్యం ఇచ్చేస్తామని కన్నీళ్లు
- రైతులనే జాలితో కొనుగోలు చేస్తున్న అమాయక ప్రజలు
- తీరా బియ్యం కొలతతో కనికట్టు
- గుంటూరు పోలీసులకు బాధితుల ఫిర్యాదు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం 9/2వ లైనులో తాజాగా వెలుగు చూసిన సంఘటనలో మూడు కుటుంబాలకు ఈ ఐదుగురు సభ్యుల గ్యాంగు 380 కేజీల బియ్యం అని చెప్పి డబ్బాతో కొలత వేసి ఇచ్చి దాదాపుగా రూ. 18 వేల నగదు తీసుకొని మెల్లగా జారుకొన్నది. రైతుల ముసుగులో ఉన్న వాళ్లు వెళ్లిన తర్వాత చూడగా తూకంలో సగానికి సగం వ్యత్యాసం కనిపించింది. దీంతో బాధితులు నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వచ్చి సీసీ టీవీ ఫుటేజ్‌లను పరిశీలించి ముఠా తీసుకొచ్చిన వాహనాల నంబరు ప్లేట్లలో రిజిస్ట్రేషన్ నంబర్లు కనిపించడం లేదని చెప్పి వెళ్లిపోయారు.

ఏదైనా వస్తువు/సరుకులు తక్కువ ధరకు వస్తున్నాయంటే చాలామంది వాటిని కొనుగోలు చేసేందుకు తలొగ్గుతుంటారు. తాము కొనుగోలు చేయదలిచిన వస్తువుని ఎందుకు మార్కెట్ కంటే తక్కువ ధరకు ఇస్తున్నారన్న చిన్న విషయాన్ని అసలు పట్టించుకోరు. ఈ క్రమంలో మోసగాళ్ల వాళ్లని ఆలోచన కూడా చేసుకోనీయకుండా తమ విద్యని ప్రదర్శిస్తుంటారు. గుంటూరు నగరంలో విద్యావంతులు, ఉద్యోగస్తులు ఎక్కువగా ఉన్న ఏటీ అగ్రహారంలో దొంగలు తమ ప్రతాపాన్ని ప్రదర్శించారు. గత వారంలో తలపాగ, లుంగీలు ధరించి అచ్చం రైతుల వలే ఇంటింటికి వెళ్లారు. తాము తెనాలి పక్కన గ్రామం నుంచి వస్తున్నామని చెప్పి ఈ ఏడు వరి పంట సాగు చేసి నష్టపోయామని కళ్ల నీళ్లు పెట్టుకొన్నారు. తాము పండించిన ధాన్యాన్ని మిల్లుకు ఇచ్చి బియ్యం తీసుకొన్నామని, బయట మార్కెట్‌లో కేజీ రూ. 60 పైగానే ఉన్నాయని చెప్పారు. తాము కేవలం రూ. 48కే ఇస్తామని, బియ్యం నాణ్యత నంబరు. 1 అన్నారు. కావాలంటే వండి చూసుకోవాలని కొంత బియ్యం ఇచ్చి అక్కడే ఉన్నారు.

ఇది నిజమేనని నమ్మిన మూడు కుటుంబాలు బియ్యాన్ని అప్పటికప్పుడు నానపోసి వండాయి. అన్నం పొడిపొడి లాడటంతో క్వాలిటీ బియ్యం అని నమ్మి 25 కేజీలు చొప్పున ఇవ్వమన్నారు. అందుకు ఆ ఐదుగురు మోసగాళ్ల అయ్యా... అయ్యా మీ కాళ్ల పట్టుకొంటామంటూ వారి పాదాల మీద పడి తమ వద్ద 380 కేజీలున్నాయని... అంతా తీసుకోవాలని ప్రాధేయపడ్డారు. బియ్యాన్ని ఎలాంటి పురుగు పట్టదని నమ్మించారు. దాంతో ఒక వ్యక్తి 85 కేజీలు, మరోకొరు 165 కేజీలు, మరొకరు 130 కేజీల బియ్యాన్ని కొనుగోలు చేశా రు. ఆ సమయంలో వారిలో ఒకరి వద్ద నగదు లేకపోవడంతో మోసగాళ్లలో ఒక వ్య క్తి తన వాహనం ఎక్కించుకొని మరీ ఏటీఎం వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు బియ్యంని వాళ్ల వెంట తెచ్చుకొన్న డబ్బాతో కొలత వేస్తూ కనికట్టు చేశారు. మోసగాళ్లు ఉన్నంత సేపు బాధితులు తూకంలో మోసగిస్తున్నారన్న విషయాన్ని గ్రహించలేకపోయారు. వాళ్లు వెళ్లిన కొన్ని గంటల తర్వాత బియ్యం బస్తాలు చిన్నవిగా ఉండటం చూసి కాటా వేయించగా సగానికి సగం వ్య త్యాసం వచ్చింది. మొత్తం మీద 190 కేజీలు మాత్రమే తూగా యి. తాము నిలువునా మోసపోయామని గ్రహించి ముగ్గురు బాధితులు నగరంపాలెం పోలీసుస్టేష న్‌లో ఫిర్యాదు చేయగా ఒక కానిస్టేబుల్‌ని సీఐ పంపించారు. ఆ కానిస్టేబు ల్ వచ్చి సీసీ టీవీ ఫుటేజ్‌ని పరిశీలించి వాహనాల నంబర్లు సరిగా కనిపించడం లేదని వెళ్లిపోయారు. ఇలాంటి సంఘటనలే జిల్లాలో మరికొన్ని చోట్ల జరిగినట్లు తెలిసింది.

అడ్మిషన్ల కోసం ఆరాటం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంపే లక్ష్యంగా అధ్యాపకులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 25 పైగా ఉండగా ప్లస్ టు కళాశాలలో మరో 30 వరకు ఉన్నాయి. ఆయా కళాశాలలో అడ్మిషన్లు కోసం ఈ ఏడాది జనవరి నుంచే అధ్యాపకులు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించారు .పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థుల ఇంళ్ళ వద్దకు వెళ్లి వారి పూర్తి వివరాలుసేకరించారు. ప్రభుత్వ కళాశాలలో చేరాలని ఇక్కడ ఉన్న సౌకర్యాలు, బోధన తీరు, గత సంవత్సరాల్లో సాధించిన ఫలితాలు తదితర వివరాలు వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

గుంటూరు (విద్య) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు దాదాపు 60 వేల మందికి పైగా ఉన్నారు. ఆయా విద్యార్థుల్లో అత్యధికమంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారే. కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఫీజు రూ 30 వేల నుంచి రూ 1.25 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఈ నేపద్యంలో ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ కళాశాలకు దీటుగా మెరుగైన శిక్షణ ఇచ్చి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

అనేక సౌకర్యాలు

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. ఇబ్బడి ముబ్బడిగా విద్యార్థులను చేర్చుకోకుండా తరగతికి 40 మంది ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు .ఉచిత విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మధ్యాహ్న భోజనం తో పాటు విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, ఎంసెట్ పరీక్ష కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అర్ధ సంవత్సరం పరీక్షల పూర్తికాగానే ఆయా ప్రవేశ పరీక్షలకు విద్యార్థుల్ని తయారు చేసేలా అధ్యాపకులు ప్రత్యేక ప్రణా ళిక సిద్ధం చేసుకుని శిక్షణ అందిస్తున్నారు. గత ఏడాది జేఈఈ మెయిన్స్ కోసం ప్ర త్యేకంగా గుంటూరులోని ప్రభుత్వ బా లికల జూనియర్ కళాశాలలో నోడల్ సెంటర్‌గా రాష్ట్ర ప్రభుత్వం గుర్తిం చింది. దీని ద్వారా జిల్లాలోని అన్ని కళాశాలలకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించేలా ఏర్పాటు చేస్తున్నారు.

ఇంటింటికీ ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు
విద్యార్థుల సమాచార సేకరణ
పది ఫలితాలు రాగానే ఆన్‌లైన్ అడ్మిషన్లు



అడ్మిషన్ కోసం విద్యార్థులు ఇంటి వద్ద ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు

పది విద్యార్థులకు బ్రిడ్జి కోర్స్

పదో తరగతి పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బ్రిడ్జి కోర్స్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులకు మారిన సిలబస్ ప్రకారం ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాలు ఇంటర్ విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందించి ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్స్ నిర్వహించనున్నారు. దీనివల్ల ఇంటర్లో సబ్జెక్టులు సులభంగా అర్థమయ్యే అవకాశం ఉందని చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు లక్ష్మణరావు ఆంధ్రజ్యోతికి వివరించారు. ప్రధానంగా గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ ,బోటనీ, సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు ఎన్సీఈఆర్టీ సిలబస్ ప్రకారం రూపొందించారు. ఇప్పటివరకు స్టేట్ సిలబస్లో చదివిన విద్యార్థినీ విద్యార్థులకు ఎన్సీఈఆర్టీ సిలబస్ పుస్తకాల సబ్జెక్ట అర్థమయ్యేలా బ్రిడ్జి కోర్సును రూపొందించారు. పదో తరగతి ఫలితాలు రాగానే ఆన్‌లైన్ అడ్మిషన్స్ నిర్వహించేలా ఇంటర్ బోర్డు ఏర్పాటు చేస్తోంది. విద్యార్థులు నేరుగా వెబ్ సైట్ వెళ్లి తమ అడ్మిషన్స్ ప్రక్రియ పూర్తి చేసుకునే అవకాశం కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంపే లక్ష్యంగా ఇంటర్ బోర్డు అధికారులు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, సిబ్బంది సమష్టి కృషితో ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

అమరావతి రాజమార్గాలకు టెండర్లు

- రాజధానిలో ఈ - 13, ఈ - 15 రోడ్ల విస్తరణకు టెండర్లు
- కురగల్లు నుంచి మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్ - 16 వరకు ఈ - 13 రోడ్డు
- ఈ 13 రోడ్డుకు రూ. 70 కోట్ల వ్యయంతో టెండర్లు
- నిడమర్రు నుంచి మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్ - 16 వరకు ఈ - 15 రోడ్డు
- సీడ్ యాక్సెస్ రోడ్డుకు రైతుల నుంచి సహాయ నిరాకరణతో .. ప్రత్యామ్నాయ రాజమార్గాల అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) అమరావతి ప్రధాన రాజమార్గాలకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) టెండర్లు పిలిచింది. కురగల్లు నుంచి ఈ - 13, నిడమర్రు నుంచి ఈ - 15 రోడ్లను అమరావతి ప్రధాన రాజమార్గాలుగా పదహారవ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16)కు అనుసంధానించేందుకు టెండర్లు పిలిచింది. అమరావతి రాజధానికి ప్రధాన రాజమార్గంగా సీడ్ యాక్సెస్ రోడ్డును అభివృద్ధి చేసినప్పటికీ .. దీనిని ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానం చేయటంలో సమస్యలు ఏర్పడ్డాయి. స్థానిక ఉండవల్లి రైతులు కొందరు భూములు ఇచ్చే విషయంలో అభ్యంతరాలు లేవనెత్తుతున్నారు. సహాయ నిరాకరణ చేపడుతున్నారు. దీంతో సీడ్ యాక్సెస్ రోడ్డు మొదటి ఫేజ్ పనులు మాత్రమే పూర్తయ్యాయి. రెండో ఫేజ్ పనులు ఉండవల్లి నుంచి మణిపాల్ హాస్పిటల్ మీదుగా కనకదుర్గ వారధి దిగువన ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానించాల్సి ఉంది. ఇక్కడి ఉండవల్లి రైతుల సహాయ నిరాకరణ కారణంగా సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో ఫేజ్ పనులు చేపట్టడం ఇప్పట్లో కష్టంగా ఉంది. సీడ్ యాక్సెస్ రోడ్డుకు భూములు తీసుకునే విషయంలో దాదాపుగా 40 కేసులపైగా న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. సీడ్ యాక్సెస్ రోడ్డును విస్తరించేందుకు ఇంతకు ముందు మంత్రి నారాయణ రైతుల ఇంటికి వెళ్ళి విజ్ఞప్తి చేశారు. కొంతమంది సహకరించినా.. మరికొందరు సహకరించలేదు. తమవి ఖరీదైన భూములు కాబట్టి ప్యాకేజీ పెంచాలని మరికొందరు డిమాండ్ చేశారు. ప్యాకేజీ అనేది ఎవరికైనా సమానంగా ఉండాలన్నది ప్రభుత్వ నిర్ణయం. కొంతమందికి ఎక్కువగా ఇచ్చి.. మరికొందరికి తక్కువగా ఇవ్వటం తప్పుడు సంకేతాలను ఇస్తుందన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం కూడా తాను అనుకున్న ప్రకారం కట్టుబడి ఉంది. ఎన్నో దఫాలు రైతులతో సంప్రదింపులు చేస్తున్నారు. ఇప్పటికీ సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. రాజధానిలో రూ. 41 వేల కోట్ల మేర వివిధ ప్రాజెక్టుల పనులకు టెండర్లు పిలిచినప్పటికీ .. రాజధానికి రాజమార్గాల అంశం తేలటం లేదు. దీంతో ఏడీసీ అధికారులు ప్రత్యామ్నాయంగా ఈ - 13, ఈ - 15 రోడ్లను ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానించి అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ - 13 రోడ్డును కురగల్లు నుంచి 7.29 కిలోమీటర్ల మేర మంగళగిరి మీదుగా ఎన్‌హెచ్ - 16కు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఈ - 15 రోడ్డును నిడమర్రు నుంచి మంగళగిరి మీదుగా 3.52 కి లోమీటర్ల మేర ఎన్‌హెచ్ - 16 కు అనుసంధానించాలని నిర్ణయించారు. ఈ రెండు రోడ్లకు సంబంధించి ఏడీసీ అధికారులు తాజాగా టెండర్లు పిలిచిరు. ఈ - 13 రోడ్డును రూ. 70 కోట్ల వ్యయంతో వరదనీటి కాలువలతో సహా నిర్మించేందుకు టెండర్లు పిలవటం జరిగింది. ఈ - 15 రోడ్డును రూ. 384.76 కోట్ల వ్యయంతో టెండర్లు పిలవటం జరిగింది. ఈ రెండు ప్రధాన రాజమార్గాలను రెండేళ్లలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.



చినగంజాం మండల పరిధిలో ఆక్వా సాగు

ఆక్వా.. ఆందోళన

- ట్రంప్ దెబ్బకు విలవిల
- పన్నుపోటుతో దిగజారిన రొయ్యల ధరలు
- భారీ నష్టాలు తప్పవని సాగుదారుల్లో భయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆక్వా రంగంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రూపంలో సుంకాల విపత్తు వచ్చిపడింది. దీంతో ఆక్వా సాగు చేయడంపై రైతులు పునరాలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. రొయ్య ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా 26 శాతం పన్నులు విధించడంతో ధరలు పతనమయ్యాయి. అసలే తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ఆక్వా రంగం ట్రంప్ దెబ్బకు విలవిలలాడుతోంది. ఆక్వా రంగానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రభుత్వం చెబుతున్నా రైతులు మాత్రం అమెరికా పన్నుల ప్రభావంతో నష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆక్వా సాగుకు సంబంధించి ఏడాదికి రెండు నుంచి మూడు పంటలు తీస్తుంటారు. ప్రధానంగా జనవరి నుంచి మే, జూన్ నుంచి అక్టోబరు సీజన్ల మీదనే ఆక్వా రైతులు దృష్టి సారిస్తారు. అమెరికా విధించిన సుంకాల ప్రభావంతో రొయ్యల ధరల్లో ఇప్పటికే తిరోగమనం మొదలైంది. జూన్ నుంచి ప్రారంభమయ్యే సీజన్‌లో సాగుపై ఆక్వా రైతులు పునరాలోచనలో పడ్డారు. పూర్తిగా క్రాప్ హాలిడే తీసుకోకపోయినా సాగు విస్తీర్ణంలో మాత్రం గణనీయంగా కోత పడే సూచనలు ట్రంప్ పన్నుల ప్రభావం వల్ల కనబడుతోంది.

జిల్లాలో 22,500 ఎకరాల్లో రొయ్యల సాగు...

బాపట్ల జిల్లా వ్యాప్తంగా 22,500 ఎకరాల వరకు రొయ్యల సాగు జరుగుతోంది. దిగుబడుల్లో దాదాపు 90 శాతం విదేశాలకే ఎగుమతి అవుతున్నాయి. జిల్లా నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తుల విలువ ఏడాదికి రూ.850 కోట్లు కాగా ఇందులో అమెరికా వాటా దాదాపు 45 శాతం వరకు ఉండడమే ఆక్వా రంగం కలవరపాటుకు కారణంగా ఉంది. రెండు వారాల క్రితం వరకు వంద కౌంట్ కిలో ధర రూ.250గా ఉండగా ప్రస్తుతం రూ.40 తగ్గుదల నమోదైంది. పెద్ద కౌంట్ రొయ్యలే ఎక్కువగా అమెరికాకు ఎగుమతి అవుతుంటాయి. 30,40 కౌంట్ రొయ్యల ధరల్లో కూడా పతనంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇదే పరిస్థితి కొనసాగితే...

ఈ పన్నుల నిర్ణయం వెలువడక ముందు ప్రభుత్వం తీసుకుంటున్న ఉద్దీపన చర్యల వల్ల జిల్లాలో ఆక్వా సాగు పెరుగుతుందనేది అంచనాగా ఉంది. కానీ ట్రంప్ నిర్ణయంతో ఆ అంచనాలు ఒక్కసారిగా తారుమారవడంతో పాటు ఏటా సాగయ్యే విస్తీర్ణంలోనే నాలుగు నుంచి ఐదు వేల ఎకరాల వరకు తగ్గుదల నమోదయ్యే అవకాశాలు కనబడుతున్నాయి. ముందు రొయ్యల ధరలు మరింతగా క్షీణిస్తే ఆక్వా క్రాప్ హాలీడే దిశగా వెళ్లిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్ని రైతాంగం వ్యక్తం చేస్తోంది. చిన్న, సన్నకారు రైతులపై పన్నుల ప్రభావం భారీగా ఉండొచ్చని తెలుస్తోంది. జిల్లాలో సాగు విస్తీర్ణంలో దాదాపు 75 శాతం వాటా చిన్న రైతులదే కావడం గమనార్హం. ఇదిలా ఉంటే జిల్లాలో ఆక్వా రంగంపైనే ఆధార పడి ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు పదివేల మంది వరకు ఉపాధి పొందుతున్నారు. ఆక్వా రంగం తిరోగమన బాట పడితే ఇందులో సగం మంది జీవనోపాధి ప్రశ్నార్థకం కానుంది. అయితే విదేశాలకు రొయ్యల ఎగుమతి విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలపై కూడా దృష్టి పెట్టామని పాలకులు చెబుతున్నారు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి ఇప్పటికే విద్యుత్ రాయితీని ప్రకటించామని, పరిస్థితులన బట్టి అవసరమైతే మరిన్ని ప్రోత్సాహక చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం భరోసా ఇస్తోంది.

ఆక్వా రైతుల పాలిట శాపమే..



అమెరికా విధించిన సుంకాలు కచ్చితంగా ఆక్వా రైతుల పాలిట శాపం లాంటిదే. 26 శాతం అని చెబుతున్నారు కానీ మొత్తంగా చూస్తే ఇది 27 శాతం వరకు పన్నులు పడే అవకాశం ఉంది. ఐదేళ్ల నుంచి అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నాం. కొంచెం గాడిన పడే సమయానికి ఇది వచ్చి పడింది. ప్రభుత్వం కేంద్ర పెద్దలతో చర్చలు జరిపి రైతులకు మేలు చేసే నిర్ణయం వచ్చే విధంగా చూడాలి

-బి. రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ సీఫుడ్ సప్లయిర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు

వెలగపూడిలో జోష్



వెలగపూడి గ్రామ ఏరియల్ వ్యూ

- సీఎం చంద్రబాబుది మా ఊరేనని సంబరాలు
- మా ఇంటి ముందు నుంచే వెళతారంటూ ఒకరు..
- మా ఇంటి పక్కనేనంటూ మరొకరు ఉబ్బితబ్బిబ్బు
- ఇంటి నిర్మాణంతో రాజధానికి కొండంత అండని ఆనందం

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరా వతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునా యుడు ఇల్లు కట్టుకునేందుకు సిద్ధమవడంతో అమరావతి ప్రజల ఆనందానికి హద్దులే లేకుండా పోయాయి. అందులోనూ వెలగపూడి వాసులైతే పట్టలేనంత ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతున్నారు. ఎందుకంటే ఎప్పుడోగానీ కనిపించని ముఖ్యమంత్రి ఇక ఎప్పుడూ తమతోనే ఉంటారన్న ఆనందం వారిని నిలువనీయడం లేదు. 3,500 మంది జనాభా ఉండే వెయ్యి గడపల చిన్న ఊరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం ఏర్పాటు చేసుకోనుండటంతో ఆ ఊరు వారందరికీ పట్టరాని సంతోషంగా ఉంది. చంద్రబాబు ఇంటి శంకుస్థాపన సందర్భంగా బుధవారం వెలగపూడిలో అదే కనిపించింది. చంద్రబాబు ప్రతి రోజూ మా ఇంటి ముందు నుంచే వెళ్లాలి.. చంద్రబాబు ఇంటి పక్కనే మా ఇల్లు.. చంద్రబాబు.. మేమూ ఒకే బజారు అని చెప్పుకోవచ్చు.. అంటూ ఎవరికి తోచిన రీతిలో వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ బంధువులకు, మిత్రులకు ఫోన్లు చేసి మరీ ఈ విషయాలు చెప్పుకుంటున్నారు.

రైతుల మాటల్లో నిబ్బరం..

గడిచిన ఐదేళ్లలో అమరాతి రైతులు నరకం అనుభవించారు. రాజధాని కోసం భూములివ్వడమే నేరంగా గత ప్రభుత్వం కక్ష సాధించింది. 1600 వందల రోజుల పాటు రైతులు నిత్యనరకం అనుభవించారు.ప్రభుత్వం మారి రైతులకు మంచి రోజులు వచ్చాయి. కానీ ఏదో ఒక మూల వారికి భయం పోలేదు.. మళ్లీ ఆ చీకటి రోజులు ఎక్కడ వస్తాయో.. తమను ఏం చేస్తాయోనన్న ఆందోళన వారిలో కనిపిస్తూనే ఉంది. ఆ ఆందోళనను పటాపంచలు చేసేలా చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో వారి మధ్యలోనే నివాసం ఉండేందుకు సిద్ధమవడం వారికి కొండంత ధైర్యాన్ని ఇచ్చింది.

● చరిత్రాత్మక కుటుంబం నుంచి స్థలం

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇంటి స్థలం అమ్మిన కుటుంబానికి ఆ ప్రాంతంలో గొప్ప చరిత్ర ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో వెలగపూడి సర్పంచ్‌గా కంచర్ల శాంతకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శాంతకుమారి మామ కంచర్ల అంజయ్య 1957లో 18 కిలోమీటర్ల కరకట్ట నిర్మాణానికి కృషి చేశారు. అప్పటి నుంచి ఆయన పేరు కరకట్ట అంజయ్యగా ఈ ప్రాంత ప్రజలు పిలుస్తారు. గతంలో రాష్ట్ర సచివాలయ శంకుస్థాపన సమయంలో కరకట్టకు అంజయ్య పేరు పెట్టాలని వారి కుటుంబసభ్యులు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. కాగా శాంతకుమారి, ఆమె భర్త కంచర్ల సాంబశివరావు రాజధాని కోసం 25 ఎకరాలకు పైగా భూములు ఇచ్చి రిటర్నబుల్ ప్లాటును తీసుకున్నారు. ఆ ప్లాటు ఇప్పుడు సీఎం చంద్రబాబు నివాసానికి ఉపయోగపడడంపై వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు ఇంటికి దక్షిణంగా మా స్థలం



చంద్రబాబు కట్టుకునే ఇంటికి దక్షిణ వైపున నాకు 9000 గజాల ప్లాటు ఉంది. రైతుల పక్కనే సీఎం చంద్రబాబు ఇల్లు కట్టుకోవడం ఆనందంగా ఉంది. గత వైసీపీ ప్రభుత్వం అమరావతిని నిర్వీర్యం చేసింది. సీఎం వచ్చి అమరావతిని నిలబెట్టారు.

-కారుమంచి సూరిబాబు


చంద్రబాబు ఇంటికి ఆగ్నేయంగా మా ప్లాటు



చంద్రబాబు ఇంటికి దక్షిణ ఆగ్నేయం వైపు నాకు 630 గజాలు ప్లాటు ఉంది. మా గ్రామంలో చంద్రబాబు ఇంటికి శంకుస్థాపన చేయడం మా అందరికీ పండగలా ఉంది. గత 8 ఏళ్ల నుంచి వెలగపూడి రెవెన్యూలో కట్టిన రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర పాలన జరగడం సంతోషంగా ఉంది. ఇదే రెవెన్యూలో చంద్రబాబు ఇల్లు కట్టుకోవడం చాలా సంతోషం.

-నాయుడు నాగేశ్వరరావు

మా స్థలం కొనుక్కోవడం సంతోషం



ఇల్లు కట్టుకోవడానికి స్థలం కావాలి.. అమ్ముతారా అంటూ చంద్రబాబు నుంచి సమాచారం వచ్చింది. ఆ సమాచారం రాగానే ఎంతో సంతోషపడ్డాం. చంద్రబాబు విజన్‌ను నమ్మి రైతులు 33వేల ఎకరాలు ఇచ్చారు. అలాంటి నాయకుడికి మా స్థలం నచ్చడం సంతోషంగా ఉంది.

-కంచర్ల శాంతకుమారి, మాజీ సర్పంచ్

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పెట్రోలియం ధరలు తగ్గించాలంటూ సీపీఎం ఆందోళన

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.ఆంజనేయ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని స్టేషన్ రోడ్డులోని గాంధీపార్కు వద్ద గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల ముందు పెట్రోలియం ధరలు తగ్గించి అధికారం చేపట్టిన బీజేపీ ప్రజలకు ఇచ్చినమాట తప్పిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, టీ పెద్దిరాజు, కె.రామారావు, సయ్యద్ జిలానీ, మస్తాన్‌వలి, డీ సుభాష్ చంద్రబోస్, ఖాసీమ్, ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి పౌష్టికాహార పక్షోత్సవాలు

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు 15 రోజులపాటు 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషన్ పక్వాడ) పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై పల్నాడు జిల్లా కలెక్టరేట్లో ఆయన అవగాహన కోసం గోడ పత్రిక ఆవిష్కరించారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న లారీ: తల్లీకొడుకుకు గాయాలు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల-నరసరావుపేట ప్రధాన రహదారిపై రావిపాడు వద్ద మోటారు సైకిల్‌ను లారీ ఢీకొన్న సంఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తున్న తల్లి జ్యోతి, కుమారుడు నితిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో ఉద్యోగం ఇప్పిస్తారని 10 లక్షల పైగా జడ గణేష్ అనే వ్యక్తి తీసుకుని మోసం చేసినట్లు బాధితుడు రాజేష్ బుధవారం తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో మూడుసార్లు న్యాయం చేయాలని ఫిర్యాదు ఇచ్చిన స్పందన లేదన్నారు. పోలీస్‌స్టేషన్‌లో రాజీచేసి డబ్బులు ఇప్పిస్తామని పెద్దమనుషులు ఒప్పందపత్రం రాసిఇచ్చి ఆరు నెలలు గడుస్తున్నా అతీగతీ లేదని ఆరోపించారు.

విద్యార్థికి ఆర్థికసాయం

రొంపిచర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి పలువురు సాయం చేశారు. మండలంలోని మాచవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న గర్నెపూడి ప్రేమ్‌రాజ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న నాజ్ ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్ తరుపున లాల్ అహమ్మద్ రూ.5వేలు, పాఠశాల హెచ్ఎం నాగరాజు రూ.1000, ఉపాధ్యాయులు మదన్‌మోహన్ రూ.1000 బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ అబ్రహం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

రొంపిచర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నలగార్లపాడు, మాచవరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కిట్లను బుధవారం పంపిణీ చేశారు. నాజ్ ఫౌండేషన్, మదన్‌మోహన్‌ల ఆధ్వర్యంలో మూడు పాఠశాలల్లోని విద్యార్థులకు వీటిని అందజేశారు. మాచవరంలోని యూపీ పాఠశాల ఉన్నత పాఠశాలగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి మారనుందని హెచ్ఎం నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ అబ్రహం, ఉపాధ్యాయులు నాగయ్య, రామాంజనేయులు, లాల్‌అహమ్మద్, మదన్ మోహన్, అంతయ్య, నాగరాజు, నాగవర్ధిని పాల్గొన్నారు.

రొంపిచర్లలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై శిక్షణ

రొంపిచర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల ఘన వ్యర్థ పదార్థాల షెడ్డు ఆవరణలో బుధవారం స్వర్ణాంధ్ర, స్వర్ణాంధ్రపై శిక్షణ కార్యక్రమం జరిగింది. నరసరావుపేట మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం

నాదెండ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద తాగునీటి చలివేంద్రాన్ని ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, కార్యదర్శి ఎంవీ సుబ్బారావు, ఎన్.పూర్ణయ్య, నారాయణస్వామి పాల్గొన్నారు.

నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గానికి ఘన సన్మానం

వినుకొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఎంపికైన వినుకొండ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులతో పాటు, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయవాద గుమాస్తాలు పెద్దసంఖ్యలో పాల్గొని అధ్యక్షుడు మీసాల శ్రీనివాసరావుతో పాటు సెక్రటరీ పఠాన్‌గౌస్ మొహిద్దీన్‌ఖాన్, వైస్ ప్రెసిడెంట్ వీవీ రమణారెడ్డి, జాయింట్ సెక్రటరీ నీలం శేఖర్ బాబు, కోశాధికారి వరగాని శివశంకర్ బాబులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

ఘనంగా గీతాంజలి పాఠశాల గ్రాడ్యుయేషన్ డే

వినుకొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతాంజలి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రిన్సిపాల్ కృష్ణవేణి పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు అందించారు. తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ వై.శేషగిరిరావు, కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా గుండ్లకమ్మ


గుండ్లకమ్మలో ఇసుక కోసం తీసిన గోతులలో నిలిచిన నీరు

- ఇసుక కోసం ఇష్టారాజ్యంగా నదిలో తవ్వకాలు
- వేసవిలో వేల టన్నుల ఇసుక తరలింపు
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు
- నదిని పరిరక్షించాలని పరివాహక ప్రాంత ప్రజల డిమాండ్

వినుకొండ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అలు వ్యవసాయదారులకు, పలు గ్రామాలకు జీవనాధారంగా మారిన నిలిచిన గుండ్లకమ్మ నది మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారుతోంది. సుదూర ప్రాంతాల నుంచి నిత్యం నీటి ప్రవాహంతో జీవన నదిగా మారిన గుండ్లకమ్మకు అక్రమార్కుల తాకిడితో నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొని ఉంది. మార్కాపురం రోడ్డులోని చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్ద ఉన్న గుండ్లకమ్మ గడిచిన ఐదేళ్లల్లో అక్రమార్కుల చర్యలతో గోతులమయమై ప్రమాదాలకు నిలయంగా మారింది. గత కొంతకాలంగా గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో అక్రమార్కులు పెద్దపెద్ద యంత్రాలతో వేల టన్నుల ఇసుకతో పాటు గలుగును తోడివేయటంతో నది మనుగడకే ప్రమాదం పొంచి ఉంది. ఇదిలా ఉండగా పరిసర ప్రాంతాల్లోని రైతులు నీటికోసం పెద్ద పెద్ద బావులు తీయడంతో నీటి ప్రవాహం తాకిడికి బావుల రూపం కనిపించక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వేసవిలో నీరు నదిలో నీరు తగ్గటంతో గుండ్లకమ్మ బ్రిడ్జి సమీప ప్రాంతాల నుంచి ఇసుక, గలుగును అక్రమంగా తరలిస్తున్నారు. తవ్వకాలపై రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ అధికారులు నిఘా ఉంచి గుండ్లకమ్మ పరివాహక ప్రాంతాన్ని కాపాడాలంటూ ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఐక్య పోరాటాలతోనే రైతుల సమస్యలకు పరిష్కారం

● రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

చిలకలూరిపేట ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే మార్గమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ బుధవారం అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ, ఏపీ రైతు సంఘం, ఇతర అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ కాల్వకు రూ.5వేల కోట్ల నిధులు కేటాయించి ఆధునీకరించాలని కోరారు. వ్యవసాయానికి సాగునీటిని కల్పించడంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మిర్చిని క్వింటా రూ. 20వేలకు తగ్గకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ పథకాలకు 90శాతం సబ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. రైతుల సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని కోరారు. నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ నల్ల బర్లీ పొగాకు కూడా బోర్డు పరిధిలో చేర్చి గిట్టుబాటు ధరలు కల్పించాలని, ప్రస్తుతం రైతాంగం వద్ద ఉన్న బర్లీ పొగాకును ప్రభుత్వ సంస్థల ద్వారా గత ఏడాది ధరకు తగ్గకుండా కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ ప్రధానంగా భూ సంస్కరణలు జరగాలని, రైతాంగానికి కనీస మద్దతు ధరలు దక్కాలని చెప్పిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం రాధాకృష్ణ మాట్లాడుతూ నాగార్జున సాగర్ కాల్వలైన మేజర్లను పొడిగించి నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట, బల్లికురవ, యద్దనపూడి, పర్చూరు, పెదనందిపాడు మండల్లోని గ్రామాల్లో ప్రజానీకానికి తాగునీరు, సాగునీరు అందించవచ్చన్నారు. సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు మాట్లాడుతూ చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రవహించే కుప్పగంజి, నక్కవాగు, ఓగేరు వాగులను ఆధునీకరించాలని, కరకట్టలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని, సీపీఎం నాయకులు పేరు బోయిన వెంకటేశ్వర్లు తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి దాసరి వరహాలు, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, వీసీకే పార్టీ నాయకులు వంజా ముత్తయ్య, నాయకులు కందిమళ్ల వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, మల్లికార్జున్, సృజన్, కొండలరావు, తూబాటి సుభాని తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక పురోభివృద్ధికి రుణాలిస్తాం

డీఆర్‌డీఏ జిల్లా పీడీ ఝాన్సీరాణి

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సమన్వయంతో స్త్రీనిధి ఆంధ్రప్రదేశ్ ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళల ఆర్థిక పురోభివృద్ధికి అవసరమైన జీవనోపాధి రుణాలు అందిస్తామని డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు డైరక్టర్ పి.ఝాన్సీరాణి అన్నారు. బుధవారం కోటప్పకొండ డీఆర్‌డీఏ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ ప్రధానంగా స్వల్పకాలిక, మైక్రో, టైనీ వర్గీకరణ చేసి రుణాలు అందించటం జరుగుతుందన్నారు. స్త్రీనిధి ఆంధ్రప్రదేశ్‌ను సమన్వయ సహాయక సంఘం మహిళలకు 48గంటలలో జీవనోపాధి రుణం అందించేలా కమ్యూనిటీ సభ్యులు, సాంకేతిక పరిజ్ఞానంతో రుణాలు అందించటం జరుగుతుందన్నారు. స్త్రీనిధి జీవనోపాధి రుణం గరిష్టంగా రూ.లక్ష వరకు 36 నెలల వరకు వాయిదాలలో తిరిగి చెల్లించే విధంగా 11 శాతం వడ్డీతో ఇస్తామన్నారు. ఎటువంటి ప్రాసెసింగ్ ఫీజు, చార్జెస్‌లేకుండా స్త్రీనిధి రుణ సురక్ష స్కీమ్ అమలు చేయడం జరుతుందన్నారు. స్వయం సహాయక సంఘానికి స్త్రీనిధి జీవనోపాధి రుణం రూ.5 లక్షలు వరకు గ్రూపులో ఉన్న సభ్యులందరూ ఆమేరకు మైక్రో రుణాలు పొందేందుకు లేదా, ఐదుమంది సభ్యుల వరకు రూ.5లక్షల మేరకు రుణాలు పొందవచ్చన్నారు. పల్నాడు జిల్లాలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి రుణాలు లక్ష్యం రూ.120 కోట్లు, 24 వేల మంది సభ్యులకు అందిచాల్సి ఉందన్నారు. మార్చి 31నాటి రూ.47కోట్లు రుణాలు 6308 మంది సభ్యులకు రుణాలు అందించడం జరిగిందన్నారు. స్త్రీ నిధి రుణాలు అందించటంలో బెల్లంకొండ, శావల్యాపురం, చిలకలూరిపేట, నకరికల్లు, నాదెండ్ల, ముప్పాళ్ళ, రాజుపాలెం, సత్తెనపల్లి, నూజెండ్ల మండలాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. జిల్లాలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి రూ.150కోట్లు వరకు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏజీఎం, స్త్రీనిధి, డీపీఎంలు ఏపీఎంలు, పీఎంఎంయు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● నాదెండ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రుకు చెందిన మాజీ సర్పంచ్, మాజీ టీడీపీ నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యుడు నాతాని సీతారామయ్య(75) బుధవారం సాయంత్రం మృతి చెందారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు నాతానికి నివాళులర్పించారు.

● చిలకలూరిపేట: ఈ నెల 20న ఈస్టర్ పండుగను పురస్కరించుకుని మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్మశాన వాటికలను శుభ్రం చేయించే పనిని చేపట్టారు. మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని ఏఎంజీ, ఆది ఆంధ్ర కాలనీ, రాగన్నపాలెం, చీరాల రోడ్డు శ్మశాన వాటికలను బుధవారం పరిశీలించారు.

● ఈపూరు: మండలంలోని ముప్పాళ్ళ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌పై శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి నిర్మించాలని మంత్రికి వినతిపత్రం అందించారు. బుధవారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు టీడీపీ అధికార ప్రతినిధి రావర్ల జగ్గారావు, ఎ.కోటేశ్వరరావు, కాటన్ కోటేశ్వరావు తదితరులు వినతిపత్రం అందజేశారు.

● నరసరావుపేట రూరల్: పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేసుకోవాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ప్రొఫెసర్ శివనారాయణ బుధవారం తెలిపారు. మండలం మునిరాయపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని వ్యవసాయం లాభదాయకం అయ్యేందుకు తీసుకోవాల్సిన వివిధ చర్యలను వివరించారు.

● చిలకలూరిపేట: 2025-26 సంవత్సరానికి చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా జీవీహెచ్ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వై.శ్రీనివాసరావు, కార్యదర్శిగా పమిడి రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా షేక్ సైదావలి, కోశాధికారిగా జి.శివరామకృష్ణ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల కమిటీ సభ్యులు దాసరి చిట్టిబాబు పుల్లగూర జాన్ మాదాసు భానుప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఎన్నికలు నిర్వహించారు.

● ఈపూరు: మండలంలోని వనికుంట సమీపంలో అమీన్‌సాహెబ్ కుంట వద్ద లారీ బోల్తాపడింది. ఒంగోలు నుంచి హైదరాబాద్ పాత ఇనుము లోడ్‌తో వెళ్తున్న లారీ బుధవారం ఉదయం కుంట వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

● వినుకొండ: వినుకొండ నియోజకవర్గ బీఎస్పీ ప్రధానకార్యదర్శిగా కంభంపాటి నాగ వంశీ ఎంపికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొంతకాలంగా పార్టీలో పనిచేస్తున్న నేపథ్యంలో పార్టీ గుర్తించి నియోజకవర్గ ప్రధానకార్యదర్శిగా ఎంపిక చేసినట్లు వంశీ తెలిపారు.

నేత్రదానం అభినందనీయం


తిరుపతయ్య (ఫైల్‌ఫొటో)

వేల్పూరు (శావల్యాపురం) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మరణానంతరం నేత్రదానంతో మరొకరికి చూపును ఇవ్వడం అభినందనీయమని అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు అన్నారు. మండలంలోని వేల్పూరుకు చెందిన అనమాల తిరుపతయ్య అనారోగ్యంతో బుధవారం మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులు మృతుని నేత్రాలు దానం చేశారు. నేత్రదానంతో పలువురికి ఆదర్శంగా నిలిచిన మృతుడు తిరుపతయ్య కుటుంబ సభ్యులు మహాలక్ష్మమ్మ, రాఘవరావు, శ్రీనివాసరావు, శిరీష, యమునలను ఐ-బ్యాంక్ సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో దివ్యాంగులకు ఇక్కట్లు

ఈపూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో దివ్యాంగులు ఇబ్బంది పడిన సంఘటన ఈపూరులో జరిగింది. పింఛన్ల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న సదరం సర్టిఫికెట్ల పరిశీలన ఏప్రిల్ 9వ తేదీన వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంటుందని నోటీసులలో తెలిపారు. గ్రామం నుంచి సుమారు 40మంది దివ్యాంగులు బుధవారం ఈ పరీక్షల కోసం వెళ్లారు. అక్కడ వైద్యులు సర్టిఫికెట్ల పరిశీలన లేదనటంతో దివ్యాంగులు ఎండల్లో వ్యవప్రయాసలకోర్చి స్వగ్రామానికి చేరుకున్నారు. ఈపూరు ఎంపీడీవో ప్రభాకర్‌ను అడగగా నోటీసుల విషయం తమకు తెలియదన్నారు.


పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు అందచేస్తున్న అసిస్ట్ డైరెక్టర్, మునిసిపల్ చైర్మన్, కమిషనర్

అసిస్ట్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు సాయం

చిలకలూరిపేట ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సేవాసంస్థ అసిస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని 30మంది పారిశుధ్య కార్మికులకు రూ.లక్ష విలువ చేసే నిత్యావసరాలు, వ్యక్తిగత రక్షణ వస్తువులను బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులకు ప్రతి నెలా సరుకులు ఇవ్వటం జరుగుతుందని ఈ సందర్భంగా అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ శ్రీహరి బాబు, అసోసియేట్ డైరెక్టర్లు జె కృష్ణ హరీష్, విష్ణుప్రియ పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వర్ కళాశాల ఫేర్‌వెల్ వేడుకలు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫేర్‌వెల్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, కళాశాల ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం వివిధ హోటళ్లలో తనిఖీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేసినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. హోటళ్లలోని శాంపిల్స్ తీసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఇస్సపాలెం మహంకాళి ఆలయ పునః నిర్మాణం కోసం విరాళం

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునః నిర్మాణం కోసం దాతలు విరాణం అందజేశారు. వినుకొండ పట్టణానికి చెందిన వెంకట మాధవ, లక్ష్మి కుమారుడు దీపక్‌లు రూ.1,00,116 నగదును ఆలయ కార్యనిర్వహణ అధికారి నలబోతు మాధవీదేవికి అందజేశారు. ఆలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో దాతలు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు దాతలకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట పూజలు ప్రారంభం

రొంపిచర్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల జడ్పీ పాఠశాల పక్కన అంకమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈ నెల 12న జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఆవరణలో యాగశాలను ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 12వ తేదీన అంకమ్మ తల్లి, పోతురాజు, ఆలయ శిఖర ప్రతిష్ఠ జరగనున్నాయి.

శక్తి యాప్‌పై అవగాహన

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సింధు స్కూల్లో బుధవారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మొదటి పట్టణ ఎస్ఐ అరుణ మహిళల భద్రతకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు, పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన వివిధ సదుపాయాలను సాంకేతిక అంశాలను వివరించారు. ఈ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాఠశాల నిర్వాహకులు సుమారు 200మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా బీమా అందజేత

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట డివిజన్ పరిధిలో తపాలా బీమా పొంది పలు ప్రమాదాలలో అకాల మరణం చెందిన వారి కుటుంబ సభ్యులకు బుధవారం బీమా నగదును అందజేశారు. దేవపోతు వెంకటేశ్వర్లు నాయక్ కుటుంబానికి రూ.9,42,098లు, తన్నీరు అంకమ్మరావు భార్య తన్నీరు భాగ్యలక్ష్మికి ఒక్కో పాలసీకి రూ.7,71, 923 అందజేసినట్లు నరసరావుపేట తపాలా డివిజన్ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి తెలిపారు.

హాస్యాస్పదంగా జగన్‌మోహన్‌రెడ్డి తీరు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సత్యసాయి జిల్లా రామగిరి పర్యటన తీరు హాస్యాస్పదంగా ఉందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం అన్నారు. సొంత చెల్లెలు, తల్లికి న్యాయం చేయలేని జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఏమి న్యాయం చేస్తారో చెప్పాలన్నారు. హెలికాప్టర్ మొరాయింపు అని పెద్ద డ్రామా ఆడారన్నారు. జనాన్ని తరలించి బాధలో ఉన్న కుటుంబ పరామర్శకు రోడ్డుషో చేయడంపై ప్రశ్నించారు. మొరాయించిన హెలికాప్టర్ బెంగళూరు ఎలా వెళ్లిందో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు వెల్లడించాలన్నారు. రూ.5కోట్ల 50 లక్షలు ఖర్చుచేసి పాపిరెడ్డిపల్లి పర్యటనచేసి, బాధిత కుటుంబానికి నయాపైసా ఇవ్వకుండా జగన్‌మోహన్‌రెడ్డి చేసే న్యాయం ఇదేనా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు కూటమి ప్రభుత్వం 1100మంది పోలీసులు, ఇద్దరు ఎస్పీలు, ఏఎస్పీలు, 8మంది డీఎస్పీలు, ఒక డీఎస్పీ ఆధ్వర్యంలో 250మంది హెలీప్యాడ్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేసిందన్నారు. రక్షణగా వచ్చిన పోలీసులను బట్టలు ఊడదీసి నిలబెడతామన్న జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. పోలీసులను కించపరిచేలా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడటం మంచిది కాదన్నారు. బేషరత్‌గా పోలీసులకు క్షమాపణ చెప్పాలన్నారు. జగన్ తన తీరు మార్చుకుని ప్రజల కోసం పనిచేయాలని హితవు పలికారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. బుధవారం నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ వినతులపై తక్షణం స్పందిస్తూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రోడ్లు, కాలువల నిర్మాణం వంటి కనీస వసతులపై అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళ పాలనలో కనీసం వసతులను కల్పించడంలో ఘోరంగా విఫలమైందని అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.


ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

బొందిలిపాలెంలో ఆక్రమణల తొలగింపు

బొందిలిపాలెం (శావల్యాపురం) ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో శావల్యాపురం మండలంలోని బొందిలిపాలెంలో డ్రెయినేజీల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడంతో బీసీ కాలనీలో డ్రెయినేజీలు నిర్మించేందుకు రోడ్డుపై ఉన్న ఆక్రమణలను బుధవారం అధికారులు తొలగించారు. పోలీసు బందోబస్తుతో పంచాయతీ, రెవెన్యూ అధికారులు పాల్గొని ఇళ్ళ ముందు ఆక్రమించిన ప్రహరీ, అరుగులు తొలగించారు. ఆక్రమణలు తొలగించే క్రమంలో ఇంటి యజమానులమైన తమకు ముందుగా నోటీసులు ఇవ్వకుండా అధికారులు అన్యాయంగా తమ ఇళ్ళ ముందున్న ప్రహరీ కూల్చివేశారని బాధితులు ఆరోపించారు.

సంపద సృష్టించే కేంద్రాలుగా మారాలి: డీఎల్‌పీవో లక్ష్మణరావు

నాదెండ్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్లలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలపై నాదెండ్ల, యడ్లపాడు మండలాలకు చెందిన కార్యదర్శులకు తదితరులకు బుధవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎల్‌పీవో లక్ష్మణరావు మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వాహణ కేంద్రాలు సంపద సృష్టించే కేంద్రాలుగా తయారవ్వాలన్నారు. ఈ కేంద్రాలతో పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. ఎంపీడీవో ఎస్.స్వరూపరాణి మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వాహణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జాకీర్ హుస్సేన్, నిర్మల లక్ష్మీకుమారి, క్రాప్ మిత్ర తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్‌నాయక్

నేటి నుంచి పెదకంచర్లలో రీ సర్వే ప్రారంభం

● రైతులకు అవగాహన కల్పించిన తహసీల్దార్

వినుకొండ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకంచర్లలో నేటి నుంచి రీసర్వే పనులు ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌నాయక్ బుధవారం తెలిపారు. రీ సర్వే పనులు ప్రారంభిస్తున్న సందర్భంగా ముందుగా గ్రామంలో రైతులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. రీ సర్వే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. రీ సర్వే పనులు జరుగుతున్న సమయంలో రైతులు దగ్గర ఉండి తమ పంట పొలాల గట్లను సర్వే సిబ్బందికి చూపించినట్లయితే రానున్న రోజుల్లో వివాదాలకు తావులేకుండా ఉంటుందని తెలిపారు. గ్రామంలో మొత్తం 6430.22 ఎకరాల భూమికి సర్వేచేసి హద్దులు వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే ఏనుగుపాలెంలో 5447 ఎకరాలకు రీ సర్వే ముగిసిందని, ఎక్కడా ఎలాంటి వివాదాలు తలెత్తలేదని ప్రతి ఒక్క రైతు సమక్షంలో పనులు జరగనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళి, ఆర్ఐ శ్రీహరి, వీఆర్వోలు, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ

యడ్లపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం కొండవీడు పీఎంశ్రీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం సహకారంతో పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. క్లబ్ నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలో చదువుతున్న ఐదుగురు పేద విద్యార్థులకు వీటిని అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం గోరంట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ దాతలు అందించే సహకారం పేదవిద్యార్థుల ఉన్నతికి ఎంతో దోహదపడుతుందని, అది వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి ముందుకు సాగేలా చేస్తుందన్నారు. విద్యార్థులకు సాయం అందించిన రోటరీ క్లబ్ సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియచేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్ రసూల్, వైస్ చైర్మన్ వై.కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.